విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :185 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 20 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03


Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



వచ్చే 20 ఏళ్ల పెట్టుబడుల్లో
'ఇండియా ఫస్ట్'!

- పరిశ్రమలకు ప్రధాని మోదీ కీలక పిలుపు
- వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెంచండి..
- స్వదేశీ ఉత్పత్తుల నాణ్యతతో ప్రపంచ మార్కెట్లను గెలవండి
- ఉద్యోగుల వేతనాలు పెంచుతున్నారా?
- పన్ను రాయితీల ప్రయోజనాలు కార్మికులకూ అందాలి

మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి
బ్లూప్రింట్



- విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లపై సీఎం చంద్రబాబు సమీక్ష
- సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ అభివృద్ధి
- గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి
- క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అమరావతి రాజధాని
- సూర్యలంక, గండికోట ప్రాంతాలకు టూరిజం మాస్టర్ ప్లాన్

అమరావతి

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల (ఎకనామిక్ రీజియన్స్) ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి అసలైన బ్లూప్రింట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఈ మూడు ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి బ్లూప్రింట్లపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేవలం పరిశ్రమల రాక, పెట్టుబడుల ఆకర్షణ మాత్రమే అభివృద్ధి కాదని, వాటి ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు. తలసరి - మిగతా3లో



మిగులు జలాలపై
హక్కులు రావు

- కొత్త ప్రాజెక్టులకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- ఏపీ, తెలంగాణకు కీలక సూచనలు..
- అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టీకరణ
- ట్రిబ్యునల్-2 అవార్డు వచ్చే వరకు చట్టబద్ధ విధానాలు పాటించాలని ఆదేశం
- మిగులు జలాల అంచనాతో నీటిపై హక్కులు రావని తేల్చిచెప్పిన బోర్డు



భారత ప్రజాస్వామ్యం
పవిత్రమైనది

- ఎన్నికలను బహిష్కరిస్తే అంతం: రాహుల్ గాంధీ
- ఓటములు ఎదురైనా పోరాటం ఆపేది లేదు..
- ఎన్నికల వ్యవస్థలో లోపాలపై ప్రజలకు వివరిస్తాం
- మోదీ సర్కారుపై జైరాం రమేశ్ విమర్శలు..



భారత్-జపాన్ బంధం మరింత బలోపేతం!

- రక్షణ రంగంలో కీలక ఒప్పందాలకు వేగం..
- 'యూనికార్న్' ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి
- స్టెల్త్ మాస్ట్ సాంకేతికత అభివృద్ధికి సహకారం..
- సముద్ర భద్రత, నౌకాదళ ఆధునికీకరణపై కీలక చర్చలు

డిసెంబర్ 2న మూడో దశ పంచాయతీ
ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం..
- ఈ నెల 21 నుంచి నామినేషన్ల స్వీకరణ
- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న నామినేషన్ల పరిశీలన.. 27న ఉపసంహరణకు గడువు
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్
- అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ఎస్ఈసీ.. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపింది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ నెల 21, 22, 23 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు 27వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ఖరారు - మిగతా3లో

ఎంపీపీ ఎన్నికల వేళ ఉత్కంఠ..
పలు మండలాల్లో వాయిదా



- కోరం లేక కొన్నిచోట్ల నిలిచిన ప్రక్రియ..
- మరికొన్ని చోట్ల వర్గపోరు, వాగ్వాదాలు
- సమాన బలాబలాలతో మరికొన్ని మండలాల్లో సందిగ్ధం..
- శుక్రవారం తిరిగి ఎన్నికలు



గ్రూప్ రిజర్వేషన్లపై
బెర్తుల పరిమితి తొలగింపు


- రైల్వే కొత్త నిబంధనలు
- బల్క్ టికెట్ల బుకింగ్ నిబంధనలను సవరించిన సౌత్ వెస్ట్రన్ రైల్వే
- గ్రూప్ బుకింగ్స్‌కు గరిష్ఠ బెర్తుల పరిమితిని పూర్తిగా ఎత్తివేత
- స్టేషన్ మేనేజర్లు, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్లకే అనుమతి ఇచ్చే అధికారం

బర్డ్‌ఫ్లూ కట్టడికి స్వదేశీ వ్యాక్సిన్

- భారత్ శాస్త్రవేత్తల కీలక ముందడుగు!
- హెచ్5ఎన్1 వైరస్‌ను ఎదుర్కొనేందుకు తొలి దేశీయ టీకా అభివృద్ధి
- నవంబర్ 20న దేశానికి అంకితం చేయనున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

సైనిక చర్యపై రాజకీయ రగడ

- ఆపరేషన్ సిందూర్‌పై కుంభకోణం ఆరోపణలు.. మంత్రి వ్యాఖ్యలతో దుమారం
- రాఫెల్ ధరలపై వివాదాస్పద వ్యాఖ్యలు
- మంత్రి తీరుపై బీజేపీ తీవ్ర అభ్యంతరం
- సభలో నిరసన.. బయట విమర్శల దాడి



రాప్తాడు బాలిక ఫైటర్.. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యం!

- పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడిపే వరకు అండగా ఉంటా
- వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్యులతో మాట్లాడిన లోకేశ్
- డిశ్చార్జ్ తర్వాతా ప్రత్యేక వైద్య సంరక్షణ

మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్



-మొదటిపేజీ తరువాయి

ఆదాయాన్ని పెంచేలా అధికార యంత్రాంగం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో యాంకర్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రాంతానికి 'విశాఖ బే-టెక్ సిటీ'గా నామకరణం చేశారు. గతంలో హైదరాబాద్‌లో సైబరాబాద్‌ను నిర్మించిన విధంగానే, విశాఖకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో బే-టెక్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగర మేయర్‌కు వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఈ రీజియన్‌లో 167 ప్రాజెక్టులకు గానూ ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. విజయనగరం, అనకాపల్లి వైపు వేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ముందస్తుగానే ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని చెప్పారు. భూ లభ్యత తక్కువగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సమన్వయంతో ప్రత్యేక ల్యాండ్ పాలసీ తీసుకురావాలని ఆదేశించారు. ఏడాదిలోగా విశాఖలో కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేసి, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించాలని నిర్దేశించారు.

సెమీకండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్ల రంగాలకు అవసరమైన ఆర్ అండ్ డీ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి క్లస్టర్లను బలోపేతం చేయడంతో పాటు ఈ రీజియన్‌లోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. తిరుపతి ప్రాంతానికి ఇప్పటికే రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, అందులో రూ.5.70 లక్షల కోట్లు కేవలం గ్రీన్ ఎనర్జీ రంగంలోనే సమోదయ్యాయని వివరించారు. రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగానికి సంబంధించి ప్రత్యేక మాగ్నెటిక్ క్లస్టర్, మూడేళ్ల లక్ష్యంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

క్వాంటం హబ్‌గా అమరావతి

అమరావతి ప్రాంతంలో ఆక్వా, కోకో, పామాయిల్ రంగాలు ప్రధాన ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని, ప్రస్తుతం రూ.4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతిని భవిష్యత్ 'క్వాంటం కారిడార్'గా, క్వాంటం వ్యాలీ, క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల అనుసంధానంతో పాటు అమరావతి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాంత పురోగతికి కీలకంగా మారుతాయని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈల అనుసంధానం – నాలెడ్జ్ పార్టనర్లు

భారీ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, సేవలు అందించేలా ఎంఎస్ఎంఈలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి పారిశ్రామిక క్లస్టర్ వద్ద విద్య, వైద్యం, నివాస సదుపాయాలతో కూడిన పూర్తి ఎకోసిస్టమ్‌ను నిర్మించాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాల నుంచి విలువైన పదార్థాలను రీసైక్లింగ్ చేసే నూతన సాంకేతికతలపై దృష్టి పెట్టాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ఐఐటీ తిరుపతి, బిట్స్ పిలానీ వంటి ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించుకోవాలని, పాన్-ఐఐటీ నిపుణుల సేవలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

పర్యాటకానికి మాస్టర్ ప్లాన్

రాష్ట్రంలో పర్యాటకాన్ని లాభదాయక ఆర్థిక వనరుగా మార్చాలని సీఎం పిలుపునిచ్చారు. అరకు, లంబసింగి ప్రాంతాలకు రహదారులు, మౌలిక వసతులు మెరుగుపరచాలని, సీఐఐ సదస్సు ప్రతినిధులను అక్కడికి తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సూర్యలంక, గండికోట పర్యాటక ప్రాంతాలకు సమగ్ర మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని, సూర్యలంకను వెంటనే నోటిఫై చేయాలని ఆదేశించారు. ఓడరేవు, చినగంజాం, నిజాంపట్నం, దిండి తీర ప్రాంతాలను పర్యావరణహిత బీచ్ రిసార్టులుగా తీర్చిదిద్దాలన్నారు. అమరావతి-నాగార్జునకొండలను అనుసంధానిస్తూ బౌద్ధ సర్క్యూట్, శ్రీశైలం తదితర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వ సిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద ప్రతిపాదించిన రూ.9,180 కోట్ల విలువైన 60 ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, అభివృద్ధి ప్రణాళికల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్ల సీఈఓలు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికల వేళ ఉత్కంఠ.. పలు మండలాల్లో వాయిదా

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఉపాధ్యక్షుల ఎన్నికల సందర్భంగా పలు జిల్లాల్లో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి, వైఎస్సార్‌సీపీ మధ్య బలాబలాలు సమానంగా ఉండటం, సభ్యులు ఎన్నికల సమావేశాలకు హాజరుకాకపోవడం, కోరం లేకపోవడం, ఎంపీటీసీ సభ్యులు వర్గాలుగా విడిపోవడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం వంటి కారణాలతో పలు మండలాల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మరికొన్ని చోట్ల తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో అధికారులు ఎన్నికల ప్రక్రియను నిలిపివేశారు. వాయిదా పడిన స్థానాల్లో శుక్రవారం తిరిగి ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

కోరం లేక నిలిచిన ఎన్నికలు

కృష్ణా జిల్లా మచిలీపట్నం ఉత్తర, దక్షిణ మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు కోరం లేక వాయిదా పడ్డాయి. మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినప్పటికీ సభ్యులెవరూ హాజరుకాలేదు. మంత్రి కొల్లు రవీంద్ర సోదరి సదకుదిటి శేష మల్లేశ్వరి మృతి నేపథ్యంలో టీడీపీ, జనసేన ఎంపీటీసీ సభ్యులు ఎన్నికలకు దూరంగా ఉన్నట్లు సమాచారం. దీంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేసి, శుక్రవారం నిర్వహించేందుకు నిర్ణయించారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోనూ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలుండగా, కూటమి తరఫున 15 మంది ఏకగ్రీవమయ్యారు. అయినప్పటికీ ఎన్నికల సమావేశానికి సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

కనిగిరి పరిధిలో నాలుగు మండలాల్లో వాయిదా

మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గ పరిధిలోని కనిగిరి, హనుమంతునిపాడు, పెద్దచెర్లపల్లి, వెలిగండ్ల మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలంలోనూ ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. ఆయా మండలాల్లో శుక్రవారం తిరిగి ఎన్నికలు నిర్వహించనున్నారు.

మంత్రాలయంలో టీడీపీ, జనసేన మధ్య పదవి పంచాయితీ

కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఎంపీపీ పదవి విషయంలో టీడీపీ, జనసేన మధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయి. జనసేనకు ఎంపీపీ పదవి కేటాయించేందుకు టీడీపీ ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి అంగీకరించలేదని సమాచారం. టీడీపీకే ఎంపీపీ పదవి ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని 18 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీకి 10, జనసేనకు ఒకటి, వైఎస్సార్‌సీపీకి ఏడు స్థానాలు దక్కాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రక్రియను శుక్రవారానికి వాయిదా వేశారు.



వెంకటగిరిలో సమాన బలాబలాలు

తిరుపతి జిల్లాలోని వెంకటగిరి మండలంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ మధ్య బలాబలాలు సమానంగా ఉండటంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. రిటర్నింగ్ అధికారి శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

పులివెందులలో రిజర్వేషన్ సమస్య

పులివెందులలో ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా ఎంపీపీ అధ్యక్ష పదవికి అర్హత కలిగిన ఎంపీటీసీ సభ్యుడు అందుబాటులో లేకపోవడంతో ఎన్నిక నిర్వహణ సాధ్యం కాలేదు.

పగిడ్యాలలో టీడీపీలో వర్గపోరు

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలో టీడీపీ ఎంపీటీసీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోవడంతో ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఎన్నికల ప్రక్రియను నిలిపివేశారు.

శ్రీకాకుళం జిల్లాలోనూ కోరం కొరత

శ్రీకాకుళం గ్రామీణ, గార మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలకు అవసరమైన కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. భోగాపురం మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సభ్యులు హాజరుకాకపోవడంతో రిటర్నింగ్ అధికారులు ఎన్నికలను శుక్రవారానికి వాయిదా వేశారు.

బాపట్ల, కొత్తపల్లిలో వాగ్వాదాలు

బాపట్ల మండలంలో ఎంపీపీ ఎన్నికల సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు ఆటంకాలు కలిగించడంతో ఎన్నిక వాయిదా పడింది. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లిలోనూ ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో అధికారులు ప్రక్రియను నిలిపివేశారు.

శుక్రవారంపై ఉత్కంఠ

పలు మండలాల్లో ఎన్నికలు వాయిదా పడటంతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది. కూటమి పార్టీల మధ్య పదవుల పంపకం, సభ్యుల మధ్య అంతర్గత విభేదాలు, సమాన బలాబలాలు వంటి అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి. శుక్రవారం నిర్వహించనున్న ఎన్నికల్లో ఏయే మండలాల్లో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది.

డిసెంబర్ 2న మూడో దశ పంచాయతీ ఎన్నికలు



-మొదటిపేజీ తరువాయి

కానుంది.

ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్

డిసెంబర్ 2న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. మూడో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామ పంచాయతీల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసే అవకాశం ఉంది.

రాప్తాడు బాలిక ఫైటర్..
త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యం!



బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాప్తాడు బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోంది. ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక త్వరలోనే పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తుందని మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినంత మాత్రాన తన బాధ్యత ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. బాలిక మునుపటిలా నవ్వుతూ, సంతోషంగా సాధారణ జీవితం గడిపే వరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఉండపల్లిలోని తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. బాలికకు అందుతున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలిక వేగంగా కోలుకుంటోందని వైద్యులు వెల్లడించడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

వెంటిలేటర్ అవసరం లేకుండా శ్వాస

బాలిక ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని లోకేశ్ తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్ అవసరం లేకుండానే శ్వాస తీసుకుంటోందని, నోటి ద్వారా ఆహారం తీసుకుంటోందని వివరించారు. చిన్నపాటి గాయాలకు చికిత్స కొనసాగుతోందని, ఇతరుల సహాయంతో నెమ్మదిగా నడుస్తోందని వైద్యులు వెల్లడించారు. రాయడానికి అవసరమైన శిక్షణ కూడా ప్రారంభించినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం నవ్వమని అడిగితే బాలిక చిరునవ్వు చిందించిందని పేర్కొన్నారు.

డిశ్చార్జ్ తర్వాతా ప్రత్యేక వైద్య సంరక్షణ

బాలిక ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా వైద్య సంరక్షణలో ఎలాంటి లోటు ఉండకూడదని మంత్రి సూచించారు. స్థానికంగా మానసిక వైద్య నిపుణుడిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతపురం ఆసుపత్రి సహకారంతో ప్రత్యేక థెరపిస్ట్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంటి పద్ద ఇన్ఫెక్షన్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

భవిష్యత్తు చికిత్సకు సమగ్ర ప్రణాళిక

బాలికకు భవిష్యత్తులో అవసరమయ్యే శస్త్రచికిత్సలపై ముందుగానే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని వైద్యులకు సూచించారు. చికిత్సతో పాటు మానసికంగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

వైద్య బృందానికి కృతజ్ఞతలు

"బాలిక మళ్లీ తోటి పిల్లలతో కలిసి సంతోషంగా గడపాలి. తను పూర్తిగా కోలుకునే వరకు బాధ్యత తీసుకుంటాను" అని లోకేశ్ భరోసా ఇచ్చారు. బాలికను నిజమైన ఫైటర్‌గా అభివర్ణించిన వైద్యుల మాటలకు ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. బాలిక ప్రాణాలు కాపాడి, కోలుకునేందుకు కృషి చేస్తున్న వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి నుంచి ఇంటికి చేరిన తర్వాత కూడా ఆమె ఆరోగ్యం, పునరావాసంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

మిగులు జలాలపై హక్కులు రావు

హైదరాబాద్, నవంబర్ 19: కృష్ణా నదిపై కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక సూచనలు చేసింది. ముందస్తు అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టవద్దని స్పష్టం చేసింది. కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి సంబంధించిన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 అవార్డు వెలువడే వరకు చట్టబద్ధమైన విధానాలను తప్పనిసరిగా పాటించాలని రెండు రాష్ట్రాలకు లేఖ రాసింది. కొత్త ప్రాజెక్టులను చేపట్టే ముందు వాటికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించాలని కేఆర్ఎంబీ సూచించింది. బోర్డు ముందస్తు అనుమతి పొందిన తర్వాతే అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తీసుకోవాలని స్పష్టం చేసింది. అనుమతులు లేకుండా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది.

తెలంగాణ వైఖరిపై బోర్డు వ్యాఖ్యలు

కేఆర్ఎంబీ పరిధిని సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాలు చేసిన విషయాన్ని బోర్డు తన లేఖలో ప్రస్తావించింది. బోర్డు పరిధినే ప్రశ్నిస్తూ, అదే సమయంలో వివాదాల పరిష్కారానికి బోర్డు జోక్యం కోరడం పరస్పర విరుద్ధమైన వైఖరని వ్యాఖ్యానించింది.

ఏకాభిప్రాయం లేకుండా నిర్ణయాలు కష్టం

బోర్డులో ఏకాభిప్రాయం ఏర్పడకుండా వివాదాస్పద అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం కష్టమని కేఆర్ఎంబీ పేర్కొంది. బోర్డు తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో రాష్ట్రాలు విఫలమైతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది.

మిగులు జలాలపై హక్కులు రావు

నదిలో మిగులు జలాలు ఉన్నాయనే అంచనా ఆధారంగా వాటిని వినియోగించుకునే హక్కులు రాష్ట్రాలకు సంక్రమించవని బోర్డు తేల్చిచెప్పింది. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయడం సంబంధిత ట్రిబ్యునల్ పరిధిలోని అంశమని స్పష్టం చేసింది. ట్రిబ్యునల్ నిర్ణయాలు, చట్టబద్ధ నిబంధనలకు అనుగుణంగానే నీటి వినియోగం జరగాలని సూచించింది. కృష్ణా జలాల పంపిణీ, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో కేఆర్ఎంబీ తాజా లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. బోర్డు సూచనలపై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

ధర్మవరం ఎంపీపీగా తాడిమర్రి శ్రీనివాసులు ఏకగ్రీవ ఎన్నిక!

వైస్ ఎంపీపీగా బీజేపీకి చెందిన అంగజాల రాజశేఖర్ ఎన్నిక

మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం.. నూతన పాలకవర్గం వెల్లడి



ధర్మవరం,నవంబర్ 19 (పెన్ సత్తా)శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) తెలుగుదేశం పార్టీకి చెందిన గొట్టూరు ఎంపీటీసీ సభ్యుడు తాడిమర్రి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీగా బీజేపీకి చెందిన పోతుకుంట ఎంపీటీసీ సభ్యుడు అంగజాల రాజశేఖర్ ఎన్నికయ్యారు.

గురువారం ధర్మవరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో కూటమికి చెందిన ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు తాడిమర్రి శ్రీనివాసులుకు మద్దతు తెలపడంతో ఆయన ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత ఎంపీడీవో వెంకటేశులు ఎంపీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన ఎంపీపీ తాడిమర్రి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ అంగజాల రాజశేఖర్,టీడీపీ నాయకుడు మహేష్ చౌదరి మాట్లాడుతూ, తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్,టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్,జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గొట్టూరు ఎంపీటీసీగా ప్రజలు తనకు అందించిన ఆదరణను,ప్రస్తుతం ఎంపీపీగా కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని తాడిమర్రి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యుల సహకారంతో ధర్మవరం మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు.నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీలను టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి,బీజేపీ ధర్మవరం ఇంచార్జ్ హరీష్ బాబు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మవరం 6వ వార్డులో బీజేపీలోకి భారీగా చేరికలు!



50 కుటుంబాలు కాషాయ కండువాలు కప్పుకుని పార్టీలో చేరిక

మంత్రి సత్యకుమార్ యాదవ్ అభివృద్ధి, ప్రజాసేవకు ఆకర్షితులై చేరినట్లు వెల్లడి

ధర్మవరం,నవంబర్ 19 (పెన్ సత్తా)శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని 6వ వార్డులో భారతీయ జనతా పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. మంత్రి,స్థానిక ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసేవకు ఆకర్షితులై సుమారు 50 కుటుంబాలు గురువారం బీజేపీలో చేరాయి.6వ వార్డు బీజేపీ ఇన్‌చార్జి సోమ్లా నాయక్ ఆధ్వర్యంలో ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శివప్ప, మల్లీ శెట్టి మురళి, లచ్చి,బుట్ట హరితో పాటు సుమారు 50 కుటుంబాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు.మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, బీజేపీలో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. భారతీయ జనతా పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశాభివృద్ధి, జాతీయత, సుపరిపాలన,ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై విశేష గుర్తింపు పొందుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు.ధర్మవరం నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి,సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారని వివరించారు.

పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు,గౌరవం కల్పిస్తామని, అందరూ ఐక్యంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని హరీష్ బాబు పిలుపునిచ్చారు.

కోడుమూరు ఎంపీపీ పీఠం వైయస్ఆర్‌సీపీ కైవసం

11 మంది ఎంపీటీసీల మద్దతుతో రఘునాథరెడ్డి విజయం

వైయస్ఆర్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



కర్నూలు జిల్లా: (పెన్ సత్తా) కోడుమూరు మండల పరిషత్ అధ్యక్ష పదవిని వైయస్ఆర్‌సీపీ కైవసం చేసుకుంది. వైయస్ఆర్‌సీపీ అభ్యర్థి రఘునాథరెడ్డి ఎంపీపీగా ఎన్నికయ్యారు. వైయస్ఆర్‌సీపీకి 11 మంది ఎంపీటీసీలు మద్దతు ఇవ్వగా, టీడీపీకి 9 మంది ఎంపీటీసీలు మద్దతు పలికారు. మాజీ ఇన్‌చార్జి, మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో ఈ విజయం సాధించింది.

ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు: డాక్టర్ ఆదిమూలపు సతీష్, వైయస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త

"ఈ విజయాన్ని అందించిన కోడుమూరు నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ ప్రతి కార్యకర్తకు పేరుపేరునా పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. జిల్లాలో మరో ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవడం కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి గారి నాయకత్వానికి గీటురాయిగా భావిస్తున్నాం. ఈ విజయంలో ప్రతి కార్యకర్త కృషి ఉంది. జగనన్న చెప్పినట్టు 2.0లో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.

ఎంతో ప్రేమతో పిలుచుకున్న మా రఘున్న జెడ్పీటీసీ స్థానం నుంచి మళ్లీ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉంది. నూతనంగా ఎన్నికైన ఎంపీపీ రఘునాథరెడ్డితో పాటు ఎంపీటీసీలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. మండల కన్వీనర్ రమేష్ అన్న, సర్పంచ్ అభ్యర్థి ప్రవీణ్ , శ్రీనివాస్‌రెడ్డి తో పాటు ప్రతి ఒక్కరి కృషి ఉంది. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కూడా న్యాయంగా, ఎలాంటి దౌర్జన్యం లేకుండా విజయం సాధిస్తామనే నమ్మకం ఉంది.

ప్రజల తీర్పు వైయస్ఆర్‌సీపీ పక్షానే..

"ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగకపోయినా ప్రజలు ఎంతో ఉత్సాహంగా వైయస్ఆర్‌సీపీకి అండగా నిలిచారు. రఘున్న చెప్పినట్టుగా అవినీతికి తావులేకుండా, కోట్ల కుటుంబానికి మచ్చ రాకుండా, వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పడం హర్షణీయం. మిగిలిన మండలాల్లో కూడా మేము గెలిచినట్టే భావిస్తున్నాం. దౌర్జన్యంతో, అప్రజాస్వామికంగా జరిగిన ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో మేము వెనుకబడాల్సి వచ్చింది. ప్రజల తీర్పు మాత్రం కోడుమూరు నియోజకవర్గంలో వైయస్ఆర్‌సీపీ పక్షానే ఉంది. ఈ బాధ్యతను స్వీకరించి ప్రజల పక్షాన పోరాడతాం. ప్రజలకు అర్ధరాత్రి పిలిచినా అందుబాటులో ఉండే హర్షన్న సారథ్యంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కోడుమూరులో వైయస్ఆర్‌సీపీ విజయం సాధించబోతోంది. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి ప్రవీణ్ అన్నకు విజయం చేకూర్చాలి."

30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు చూడలేదు: కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

"స్థానిక సంస్థల ఎన్నికల్లో గత నెల, నెలన్నరగా జరుగుతున్న పరిస్థితులను చూస్తే.. ఈరోజు కోడుమూరు మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక మా రాజకీయ జీవితంలో మరచిపోలేని రోజు. 30, 35 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నాం. మా నాన్న, పెద్దనాన్నలు కూడా రాజకీయాలు చేశారు. కానీ ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితుల్లో రాజకీయాలు చేయాల్సి వస్తుందని అనుకోలేదు.

వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు నామినేషన్ వేసిన మొదటి క్షణం నుంచి ఈరోజు ఎంపీపీ ఎన్నిక పూర్తయ్యే వరకు ఎన్నో వేధింపులు, ప్రలోభాలు, అధికారుల ద్వారా బెదిరింపులు ఎదురయ్యాయి. సామాన్య రైతులను కూడా ఇబ్బందులకు గురిచేసి, టీడీపీకి ఓటు వేస్తేనే పొలాలకు నీళ్లు ఇస్తామనే పరిస్థితులు సృష్టించారు. అయినా వీటన్నింటినీ ఎదుర్కొని ప్రజలు వైయస్ఆర్‌సీపీకి అండగా నిలబడి కోడుమూరును వైయస్ఆర్‌సీపీ కంచుకోటగా నిరూపించారు."

62 ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేశాం

"ఎన్ని బెదిరింపులు, ప్రలోభాలు వచ్చినా మా కార్యకర్తలు ప్రతి గ్రామంలో నామినేషన్లు వేశారు. నియోజకవర్గంలో దాదాపు 67 ఎంపీటీసీ స్థానాలు ఉంటే 62 స్థానాల్లో మా అభ్యర్థులు చివరి వరకు పోటీలో నిలిచారు. కొన్ని గ్రామాల్లో బెదిరించి, భయపెట్టి, డబ్బులు ఇచ్చి కొంతమందితో ఉపసంహరణ చేయించారు.

అధికార పార్టీ దౌర్జన్యం చేయడం సాధారణంగా చూశాం. కానీ ఇక్కడ అధికార యంత్రాంగంతోనే దౌర్జన్యం చేయించి ఎన్నికలను ఏకపక్షంగా మార్చాలని చూశారు. అయినా బెలగల్ మండలంలో 16 స్థానాలకు గాను వైయస్ఆర్‌సీపీ ఏడు స్థానాలు గెలుచుకుంది. టీడీపీ తొమ్మిది స్థానాలు గెలిచింది. రెండు, మూడు చోట్ల కౌంటింగ్‌లో కూడా అక్రమాలు జరిగాయి."

అధికారులకు హెచ్చరిక

"అధికారులకు ఒకటే చెబుతున్నా. మీరు చేసిన దుర్మార్గాల వల్ల ఎన్నో ఆశలతో పోటీ చేసిన అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లారు. ఇది చాలా దుర్మార్గమైన పరిస్థితి. ఇదే పరిస్థితి రేపు మీకు ఎదురైతే ఆ ఒకటి, రెండు సీట్లు కూడా రావు. ఎన్నికల్లో మా కుటుంబానికి, మా పార్టీకి, మాకు సహకరించిన ప్రతి కార్యకర్తకు, ప్రతి నాయకుడికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను."

రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం

"ఈరోజు రఘునాథరెడ్డి ఎంపీపీగా గెలిచిన స్ఫూర్తితో ప్రతి గ్రామంలోనూ మనం గెలిచే పరిస్థితులు ఉన్నాయి. టీడీపీ దౌర్జన్యాలు, అకృత్యాలను ఎదుర్కొని మనం నిలబడాలి. ఇంకో రెండు సంవత్సరాలు మాత్రమే ఉన్నాయి. కళ్లుమూసి తెరిచేలోపు ఆ సమయం పూర్తవుతుంది. వచ్చేది మన టైమే. జగన్మోహన్‌రెడ్డి గారు మనందరికీ భరోసా ఇచ్చారు. టీడీపీ చేసిన, చేస్తున్న తప్పులను మన అధికారం వచ్చిన తర్వాత సమర్థవంతంగా తిప్పికొడదాం. ఏ ఒక్క కార్యకర్తా భయపడాల్సిన అవసరం లేదు, నిరాశ చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరూ ముందుండి వైయస్ఆర్‌సీపీ జెండాను, ప్రజల్లో ఉన్న స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి" అని కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

కవిటి ఎంపీపీగా సీపాన."రాణి" వెంకటరమణ.

- ఘనంగా ప్రమాణ స్వీకారం !
- వైస్ ఎంపీపీగా జయశ్రీ పట్నాయక్ ఎన్నిక





కవిటి (పెన్ సత్తా) నవంబర్19:ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కవిటి మండలంలో ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకున్న సీపాన.రాణి వెంకటరమణ గురువారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు.కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి చింతాడ.చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అట్టహాసంగా, ఎంతో ఘనంగా జరిగింది.ముందుగా కవిటి మండలంలో గెలుపొందిన ఎంపీటీసీ సభ్యులు అందరూ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంపీపీగా సీపాన రాణి వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేసి, పదవీ బాధ్యతలు స్వీకరించారు.అదే విధంగా వైస్ ఎంపీపీగా జయశ్రీ పట్నాయక్ ఎన్నిక కాబడ్డారు. ఆమె కూడా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.ఈ కార్యక్రమానికి కవిటి మండలంలో ఉన్న ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కూటమి సభ్యులు అందరూ ప్రత్యేకంగా హాజరై ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన సీపాన రాణి వెంకటరమణను ప్రత్యేకంగా అభినందించి పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా టీడీపీ శ్రేణుల్లో భారీ ఉత్సాహం, సంబరాలు నెలకొన్నాయి. మండల పరిషత్ కార్యాలయం మొత్తం పండుగ వాతావరణం సంతరించుకుంది. ప్రమాణ స్వీకారం అనంతరం ఎంపీపీ సీపాన రాణి వెంకటరమణ మాట్లాడుతూ, కవిటి మండల అభివృద్ధికే తన ప్రాధాన్యత అని, శాసనసభ్యులు అశోక్ బాబు సహకారంతో అన్ని పంచాయతీ లను సమానంగా అభివృద్ధి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు.

కర్తలి మహాలక్ష్మి ఆలయంలో భక్తుల సందడి.

- ఘనంగా15వ వార్షికోత్సవం హాజరైన ప్రముఖులు, గ్రామస్తులు





కంచిలి (పెన్ సత్తా) నవంబర్19:కంచిలి మండలం కర్తలి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు 15వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తిభావంతో, ఎంతో ఘనమైన వేడుకలతో ఆలయం కళకళలాడింది.

అమ్మవారిని పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది.ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎంటిఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్ రెడ్డి కంచిలి మండల విద్యాశాఖ అధికారులు సప్పటి శివరాం ప్రసాద్,కుంబి చిట్టిబాబు, మరియు రమేష్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు మంచి పంటలు రావాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కూడా జరిగింది.గ్రామస్తులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఎంతో విజయవంతంగా జరిగాయని నిర్వాహకులు తెలిపారు.

తుఫాన్ అలర్ట్ - తీరంలో కలెక్టర్ - ముంపు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన

ఇచ్ఛాపురం (పెన్ సత్తా) నవంబర్19: ఆక్వాన్ తుఫాన్ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని తీర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు.తీర ప్రాంతాలైన డొంకూరు మరియు ఇద్దివానిపాలెం తదితర మత్స్యకార గ్రామాలను ప్రత్యక్షంగా సందర్శించి, తుఫాన్ తీవ్రతను ప్రజలకు వివరించారు. తుఫాన్ తీరం దాటే వరకు ప్రజలెవరూ బయటకు రావద్దని, ఎవరికి ఏ సమస్య ఉన్నా అధికారులతో సమన్వయం చేసుకోవాలని, స్థానిక రెవెన్యూ వ్యవస్థ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మత్స్యకారులు ఎవరూ సముద్ర వేటకు వెళ్లవద్దని ప్రత్యేకంగా విన్నవించారు.అదే విధంగా కలెక్టర్ తీర ప్రాంతంలోని ముంపు ప్రాంతాలను కూడా ప్రత్యక్షంగా పర్యటించారు. వర్షం ఎక్కువగా పడితే నీరు నిలిచిపోయే లోతట్టు ప్రాంతాలు, కాలువలు, డ్రైనేజీలు, రోడ్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.ముంపుకు గురయ్యే గ్రామాల్లో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు ఇచ్చారు.నీరు నిలిచి పోకుండా డ్రైనేజీలు క్లియర్ చేయాలని, పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, ఆహారం, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.తుఫాన్ గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోయిన వెంటనే జేసీబీలతో తొలగించి రోడ్లు క్లియర్ చేయాలని, విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్లు మూసుకుపోకుండా జేసీబీలు, సిబ్బందిని, విద్యుత్ శాఖ సిబ్బందిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ఏ గ్రామంలోనైనా స్తంభం పడినా, చెట్టు పడినా వెంటనే సమాచారం ఇస్తే నిమిషాల్లో క్లియర్ చేసే విధంగా ఏర్పాట్లు చేశామని ప్రజలకుతెలిపారు.వృద్ధులు మహిళలు, చిన్న పిల్లలు ఉన్న కుటుంబాలను ముందుగా గుర్తించి,వారికి ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఇచ్ఛాపురం మరియు కవిటి ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది మరియు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక పీఠాల పై మంత్రుల సతీమణులు.. సర్పంచ్‌గా బీసీ

జనార్దన్ రెడ్డి భార్య, ఎంపీపీగా మండిపల్లి సతీమణి!





ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తమ కుటుంబ సభ్యులను బరిలోకి దింపారు. బనగానపల్లె సర్పంచ్‌గా ఇందిరారెడ్డి నామినేషన్ వేయగా, రాయచోటిలో హరితారెడ్డి ఎంపీపీగా ప్రమాణం చేశారు. నియోజకవర్గాల్లో పార్టీ పట్టు, స్థానిక రాజకీయాలపై నియంత్రణ కోసమే ఈ నిర్ణయాలనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర మంత్రులకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. క్షేత్రస్థాయిలో తమ పట్టు నిలుపుకోవాలన్న భావనతో ఉన్న నేతలు తమ కుటుంబ సభ్యులనే బరిలోకి దింపుతున్నారు. విపక్షంగా గట్టిగా ఉన్నట్లు భావించిన వద్ద క్షేత్రస్థాయి నేతలకు అవకాశం ఇచ్చి చేతులు కాల్చుకోవడం కన్నా, తమ కుటుంబ సభ్యులనే రంగంలోకి దింపి చావోరేవో తేల్చుకుంటామన్న సంకేతాలు పంపుతున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర మంత్రి బీసీ జనార్దనరెడ్డి సతీమణి ఇందిరా రెడ్డి తమ స్వస్థలం బనగానపల్లె మేజర్ పంచాయతీ సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. ఇదే సమయంలో మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డి భార్య హరితా రెడ్డి మండలాధ్యక్షురాలిగా ప్రమాణం చేశారు. ఈ పరిణామాలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

రాయచోటిలో నువ్వానేనా

రాయచోటి నియోజకవర్గ రాజకీయాలు మొదటి నుంచీ అత్యంత వాడివేడిగా, నువ్వానేనా అన్నట్లుగా సాగుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచే నియోజకవర్గంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ మధ్య తీవ్ర స్థాయిలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నామినేషన్ల ఘట్టం నుంచి పోలింగ్ వరకు ఇరువర్గాల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, ఘర్షణ వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలోని 85 సర్పంచ్ స్థానాలు, ఎంపీటీసీ స్థానాలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి వర్గాల మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో మండల పరిషత్ (ఎంపీపీ) పీఠం చేజారితే నియోజకవర్గంలో పట్టు తగ్గుతుందనే భావనతో, అలాగే గెలిచిన ఎంపీటీసీలలో వర్గ విభేదాలు తలెత్తకుండా ఏకతాటిపై ఉంచేందుకు మంత్రి మండిపల్లి తన సతీమణి హరితను రంగంలోకి దించారు. కుటుంబ సభ్యురాలే ఎంపీపీగా ఉంటే పాలనపై పూర్తి నియంత్రణ ఉండటంతో పాటు, ప్రతిపక్ష ఎత్తుగడలను సమర్థవంతంగా తిప్పికొట్టవచ్చనే వ్యూహంతోనే ఆమెకు ఎంపీపీ పదవిని కట్టబెట్టే నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

మరోవైపు నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గ రాజకీయాల్లో 'బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీ'కి ప్రత్యేకమైన చరిత్ర, రాజకీయ ప్రాధాన్యం ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రం కావడంతో పాటు, సుమారు 40 వేలకు పైగా జనాభా కలిగిన ఈ మేజర్ పంచాయతీ సర్పంచ్ పదవిని ఎమ్మెల్యే పదవితో సమానంగా భావిస్తారు. గతంలో బీసీ జనార్దన్ రెడ్డి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆయన సోదరుడు బీసీ నాగేంద్ర వంటి వారు కూడా ఈ మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసి నియోజకవర్గ రాజకీయాల్లో తమ కుటుంబ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. బనగానపల్లె పీఠం ఎవరి చేతిలో ఉంటే నియోజకవర్గ రాజకీయ సమీకరణాలు వారి వైపే మొగ్గు చూపుతాయన్నది ఇక్కడి నానుడి.

అయితే, ప్రస్తుతం తాను రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పటికీ బీసీ జనార్దన్ రెడ్డి తన సతీమణి ఇందిరారెడ్డిని స్వయంగా సర్పంచ్ బరిలో నిలపడం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రంలో పార్టీ నాయకుల మధ్య గ్రూపు తగాదాలు రాకుండా నివారించడం, కీలకమైన మేజర్ పంచాయతీ నిధులు అభివృద్ధి పనులను నేరుగా తమ పర్యవేక్షణలో ఉంచుకోవడం ఇందులో ప్రధాన ఉద్దేశంగా చెబుతున్నారు. అంతేకాకుండా, ప్రత్యర్థి కాటసాని రామిరెడ్డి వర్గానికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా, ఏకగ్రీవం లేదా భారీ మెజారిటీతో గెలిచి బనగానపల్లెలో తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకోవాలని మంత్రి భావిస్తున్నారు. అందుకే సతీమణి ఇందిరారెడ్డి స్వయంగా రంగంలోకి దింపారని చెబుతున్నారు.

వైసీపీలో 'మూడు' నియమాలు.. జగన్ సమాలోచన!

వచ్చే ఎన్నికలే లక్ష్యంగా వైసీపీని ప్రక్షాళన చేయాలని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. షర్మిల వ్యవహారంపై పార్టీ నేతలు స్పందించకూడదని, పనితీరు బాగోలేని 40 నుంచి 80 మంది నియోజకవర్గ ఇన్‌ఛార్జీలను మార్చాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. జనవరి-ఫిబ్రవరిలో నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినట్లు సమాచారం.

వచ్చే ఎన్నికల్లో విజయం తథ్యమని.. మార్పు వస్తుందని పెద్ద ఎత్తున అంచనాలు వేస్తున్న వైసీపీ అధినేత జగన్.. కొంత మార్పు దిశగా అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. తాజాగా వైసీపీలో మూడు నియమాలను ఆయన ప్రతిపా దించారని తెలిసింది. ఒక ఓటమి తర్వాత.. మార్పు సహజంగానే వస్తుంది. అయితే.. దీనిని ఒప్పుకోక పోవడంలోనే అసలైన ఓటమి కూడా ఉంటుంది. 2024 ఎన్నికల సమయంలోతన ఓటమిని దాదాపు జగన్ అంగీకరించలేదు. కానీ, స్థానిక ఎన్నికల సమయంలో కూడా ఎదురు దాడి చేసే ప్రయత్నం చేసినా.. అంతర్గతంగా మాత్రం పార్టీ ఓటమిని ఆయన అంగీకరించారు.ఈ క్రమంలోనూ పార్టీ నాయకులు, కార్య కర్తలకు మూడు నియమాలను సూచించారని తెలిసింది. వీటిని అందరూ ఖచ్చితంగా పాటించాలని జగన్ చెప్పారని ఓ సీనియర్ నేత వెల్లడించారు. అంతర్గత సమాచారం మేరకు..

1) తన సోదరి షర్మిల విషయంపై ఎవరూ స్పందించ వద్దని తేల్చి చెప్పారు. ఇప్పటికే అంతర్గత కుమ్ములాటలు, షర్మిల వర్సెస్ జగన్ కారణంగా పార్టీపై పడుతున్న ప్రభావాన్ని సీనియర్లు ఆయనకు వివరించారు. దీంతో "మీరు ఎవరూ మా విషయాల్లో జోక్యం చేసుకోవద్దు" అని జగన్ తేల్చి చెప్పినట్టు తెలిసింది. తద్వారా షర్మిల విషయంతో వస్తున్న మైనస్‌ను తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు.2) పనితీరు ఆధారంగా ఇన్‌ఛార్జీల మార్పు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో




పనితీరు సరిగా లేని 40 నుండి 80 మంది ఇన్‌ఛార్జీలను తొలగించి, కొత్త వారికి బాధ్యతలు అప్పగించే అంశాన్ని జగన్ పరిశీలించారని తెలిసింది. ప్రధానంగా స్థానిక సమరంలో ప్రచారానికి బదులుగా సెల్ఫీ వీడియోలకు పరిమితమైన వారిపై ఆగ్రహంతో ఉన్నార ని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా బలమైన అభ్యర్థులను నిలబెట్టాలని జగన్ గతంలోనే స్పష్టం చేసినా నాయకులు చేతులు ఎత్తేయడం చర్చకు దారితీసింది.

3) జగన్ కంటే ముందే.. వచ్చే ఏడాది సెప్టెంబరు-అక్టోబరులో జగన్ పాదయాత్రకు రెడీ అవుతున్నారు. తద్వారా పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు.

అయితే.. దీనికంటే ముందే.. అంటే.. వచ్చే జనవరి-ఫిబ్రవరి మధ్య జిల్లాల వారీగా నియోజక వర్గాల్లో క్షేత్రస్థాయి నేతలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రజలను కలుసుకోవాలని జగన్ ఆదేశించినట్టు తెలిసింది. అదేవిధంగా భారీ ప్రక్షాళనలో భాగంగా, క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉండే కొత్త ముఖాలకు, యువ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని జగన్ సమాలోచనలు చేస్తున్నారు. ముఖ్యంగా జన్‌జీకి అవకాశం కల్పించనున్నారు.

ఏపీలో అన్ని పార్టీలకు ఇదే సమస్యా... వార్నింగ్‌లతో సరా..?



టీడీపీ, వైసీపీ, జనసేనల్లో అధినేతలకు, క్షేత్రస్థాయి నేతలకు మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. క్రమశిక్షణ తప్పే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా, రాజకీయ అవసరాల దృష్ట్యా వెనక్కి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. కొత్త రాజకీయ వేదికలు అందుబాటులో ఉండటంతో నేతలపై కఠిన చర్యలకు బదులుగా హెచ్చరికలతోనే సరిపెడుతున్నారనే చర్చ సాగుతోంది.

వైసీపీ, టీడీపీ, జనసేన.. ఈ మూడు పార్టీల అంతర్గత వ్యవహారం చూస్తే.. ఒకింత ఆశ్చర్యం వేస్తుంది. దాదాపు.. ఈ మూడు పార్టీలు అత్యంత కీలకం. అధికారంలోకి వచ్చే విషయంలో ఈ మూడు పార్టీల చుట్టూ ప్రజల ఓటు బ్యాంకు కూడా ముడి పడింది. అయితే.. ఈ మూడు పార్టీల్లోనూ అధినేతలకు - క్షేత్రస్థాయిలో కొందరు నాయకులకు మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. కీలకమైన ఎన్నికల సమయంలో నాయకులు అధిష్టానం చెప్పినట్టు కాకుండా.. తమ తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి.ఈ నేపథ్యంలో అలాంటి వారిపై చర్యలు ఉంటాయని చెబుతున్నా.. అలా చేయలేక ఇబ్బందిపడుతున్నారు.టీడీపీ, వైసీపీ, జనసేన మూడు పార్టీలు కూడా అధిష్టానం మాట వినని, క్రమశిక్షణ తప్పే నాయకులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. ఆయా పార్టీల అధినేతలు తమ వ్యూహాలు, ఎన్నికల అవసరాలకు అనుగుణంగా వేర్వేరు పద్ధతుల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కానీ, పెద్దగా చర్యలు తీసుకునే పరిస్థితి అయితే కనిపించడం లేదు. అధికారంలో ఉన్నందున కూటమి సమన్వయం, ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినకుండా చూడాలని టీడీపీ,జనసేన ప్రయత్నిస్తున్నాయి.

ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థులకు వ్యతిరేకంగా బరిలోకి దిగిన రెబల్ అభ్యర్థుల విషయాన్ని తీసుకుంటే.. కొందరిపై చర్యలు తీసుకున్నా.. తర్వాత.. వెనక్కి తగ్గిన పరిస్థితి ఉంది. తప్పు చేస్తే సహించేది లేదని బహిరంగంగానే హెచ్చరిస్తూ చర్యలు తీసుకుంటున్నామని అంటున్నా.. మరోవైపు నాయకుల విషయంపై బెంగా కొనసాగుతోంది. ఇదే పరిస్థితి వైసీపీలోనూ ఉంది. ఒకప్పుడు తన మాటకు ఎదురు చెప్పిన వారిని వెంటనే బయటకు పంపేసిన పరిస్థితి జగన్ అవలంభించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థుల ఏకగ్రీవాలను అడ్డుకోలేక పోయినా, క్షేత్రస్థాయి ప్రచారంలో నిర్లక్ష్యం వహించినా వచ్చే సాధారణ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వబోమని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు జగన్ అల్టిమేటం జారీ చేశారు. కానీ, ఎంత మంది ఆయన చెప్పినట్టు చేశారు? అంటే.. చెప్పడం కష్టమే. దీంతో ఇప్పుడు వారిపై చర్యలు తీసుకుంటారా ? వేచి చూస్తారా? అనేది ప్రశ్న. ఎలా చూసుకున్నా.. టీడీపీ, జనసేన, వైసీపీలు చర్యలు తీసుకునే పరిస్థితి లేదు.కేవలం హెచ్చరికల తోనే సరిపుచ్చే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే.. రాజకీయంగా వేదికలు పెరుగుతున్నాయి. కొత్తపార్టీలు పుట్టుకొస్తున్నాయి. దీంతో తీవ్ర హెచ్చరికలు చేసినా.. పార్టీ నుంచి బయటకు పంపేసినా.. అల్టర్నేట్ అవకాశం నాయకులకు కనిపిస్తోంది. దీంతో మూడు పార్టీల్లోనూ మెత్తటి చర్యలే తప్ప.. గట్టిగా హెచ్చరించే పరిస్థితి లేదని అంటున్నారు.

విజయనగరం.. బాబు వరం ఎవరికి?



ఈ నెల 23న విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం జరగాల్సి ఉండగా, ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. మజ్జి సిరిసహస్ర, పాశల నీరజ, కర్రోతు చంద్రకళ ఈ పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. సిరిసహస్ర సామాజికవర్గంపై వివాదం కోర్టులో ఉండటంతో తుది నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.మరో మూడు రోజుల్లో ప్రమాణ స్వీకార ఘట్టానికి తెరలేవనుంది. కానీ.. ఇప్పటి వరకు అధిష్టానం నుంచి ఎలాంటి సంకేతాలు రాలేదు. ఎవరిని ఎంపిక చేస్తారో.. ఎవరిని పక్కన పెడతారో.. అన్న ఉత్కంఠతో బీపీ పెరిగిపోయి.. నాయ కులు, నాయకురాళ్లు సైతం తల్లడిల్లుతున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే.. ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లా పరిషత్ స్థానానికి సంబంధించిన -చైర్ పర్సన్- ఎంపిక వ్యవహారం.. సస్పెన్స్‌గా మారింది. ఇక్కడ నుంచి విజయం దక్కించుకున్న ముగ్గురు మహిళలుఈ పీఠం కోసం వేచి చూస్తున్నారు.అంతేకాదు.. వీరికి బలమైన నేపథ్యం ఉండడం, సామాజికవర్గం పరంగా బలమైన పునాదులు, పలుకుబడి ఉండ డంతో ఎవరికివారు ఈ పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వీరిలో ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన మజ్జి శ్రీను కుమార్తె మజ్జి సిరిసహస్ర, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రధాన అనుచరురాలిగా గుర్తింపు పొందిన పాశల నీరజతోపాటు.. గత ఎన్నికల సమయంలో నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి పోటీచేయాలని అనుకుని కూడా చంద్రబాబు ఆదేశాలతో వెనక్కి తగ్గిన.. పార్టీకి వీర విధేయుడు కర్రోతు బంగార్రాజు కుమార్తె కర్రోతు చంద్రకళ ఉన్నారు.

ఎన్నికలకు ముందు.. మజ్జి శ్రీను కుమార్తెకు జడ్పీ పీఠం హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే.. ఆమె బీసీ సామాజిక వర్గం అయితే.. ఈ విషయంలో ఆమె తేడా చేశారని.. వేరే సామాజిక వర్గం అని పేర్కొన్నారని ఆరోపిస్తూ.. వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో ఈ వ్యవహారం తేలేందుకు మరోమూడు మాసాల సమయం పట్టే అవకాశం ఉంది. అయినప్పటికీ.. సిరి సహస్ర మాత్రం తనకే పీఠంఇవ్వాలని పార్టీ అధినాయకత్వాన్ని కోరుతోంది.ఇక, కర్రోతు కుమార్తు చంద్రకళ.. కూడా టీడీపీ విషయంలో తమ కుటుంబం చేసిన సేవలను ప్రస్తావిస్తున్నారు. ఆది నుంచి వీరవిధేయులుగా ఉన్నామని.. ఇప్పుడు తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. తన తండ్రి పార్టీ కోసం.. టికెట్ కూడా త్యాగం చేశారని అంటున్నారు. మరోవైపు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అనుచరురాలిని ఎలాగైనా జడ్పీపీఠంపై కూర్చోబెట్టాలని పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. దీంతో ఈ ముగ్గురి మధ్య పోటీ తీవ్రంగా ఉంది. మరోవైపు ఈ నెల 23న ప్రమాణ స్వీకారం జరగాల్సి ఉంది. మరి చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారు? ఎవరికి అవకాశం ఇస్తారన్నది ఆసక్తిగా మారింది.

వైసీపీలో రోజాకు సెగ పెడుతోందెవరు... ?



చిత్తూరు జిల్లాపై పట్టు పెంచుకునేందుకు మాజీ మంత్రి రోజా ప్రయత్నిస్తున్నారనే ప్రచారం వైసీపీలో చర్చకు దారితీసింది. అయితే ఆమెకు పార్టీలోని కొందరు నేతల నుంచే వ్యతిరేకత ఎదురవుతోందని, అంతర్గతంగా అడ్డంకులు సృష్టిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలోనూ సొంత నేతలు తనను అణచివేస్తున్నారని రోజా ఆరోపించడం గమనార్హం.

ముందు లీడర్‌గా.. తర్వాత స్టేట్ లీడర్‌గా ఎదగాలన్న ఆశ ఖచ్చితంగా అందరికీ ఉంటుంది. ఈ విషయంలో మంత్రి పదవులు కీలకంగా మారతాయి. ఇలా ఆలోచించిన మాజీ మంత్రి వైసీపీ నాయకురాలు రోజా కూడా మంత్రి అయ్యారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. అయితే.. గత ఎన్నికల్లో కూటమి హవా నేపథ్యంలో ఆమె పరాజయం పాలయ్యారు. మళ్లీ రియాల్టీ షోలు చేస్తున్నారు. ఇదే సమయంలో అడపా దడపా రాజకీయాలు చేస్తూ.. వచ్చిన ప్రతిసారీ వేడెక్కిస్తున్నారు.నగరిలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మాజీ మంత్రి ఆర్‌కే రోజా వ్యవహారం, అలాగే ఆమె సొంత పార్టీ కార్యకర్త పై ప్రవర్తించిన తీరుపై ఇటీవల తీవ్ర వివాదం చెలరేగింది. చిత్తూరు జిల్లా విజయపురం మండలం ఇల్లత్తూరు ఎంపీటీసీ స్థానంలో వైసీపీ అభ్యర్థి గెలిచినా, అధికారులు ఉద్దేశపూర్వకంగా టీడీపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారని ఆరోపిస్తూ రోజా కౌంటింగ్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. ఆందోళన సమయంలో కారులో కూర్చు ని నినాదాలు చేశారు. ఈ వ్యవహారం పెనుదుమారం రేపింది.ఆ సమయంలో రోజా కన్నీరు కూడా పెట్టుకున్నారు. ఈ సమయంలో రోజాకు వెనుక సీట్లో ఉన్న వ్యక్తిగత సిబ్బంది నీళ్ల బాటిల్ అందిం చారు. ఆ నీళ్లు పొరపాటున తనపై పడటంతో సహనం కోల్పోయిన రోజా, ఆ వాటర్ బాటిల్‌తోనే అతడిపై దాడికి ప్రయత్నించడం, కొట్టడం వీడియోల్లో వైరల్ అయింది. అనంతరం పోలీసులు ఎస్కార్టుగా ఉండి.. ఆమెను ఇంటి వద్ద దిగబెట్టి వచ్చారు. ఇదంతా ఇప్పుడు ఎందుకంటే.. వైసీపీలోనే ఓ వర్గం నాయకులు రోజాను వ్యతిరేకిస్తున్న విషయం తాజాగ వెలుగు చూసింది. పైగా.. వారంతా అంతర్గతంగా ఆమెకు వ్యతిరేకంగా చక్రం తిప్పారని అంటున్నారు.ఇంతకీ విషయం ఏంటంటే.. రోజా.. చిత్తూరు జిల్లాపైపట్టుకోసం ప్రయత్నాలు చేస్తున్నారట. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో కీలక నేతగా ఉన్న కొందరు ఓ నాయకుడు మైనస్ కావడం, వారి చుట్టూ కేసుల ముసురుకున్న క్రమంలో రోజా ఆ స్థానాన్ని భర్తీ చేయాలని భావిస్తున్నారని పెద్ద చర్చ సాగుతోంది. ఈ క్రమంలోనే ఆమెతన హవాను పెంచు కునే ప్రయత్నాలు చేశారు. కానీ, పార్టీలో ఆమెను వ్యతిరేకించే వర్గాలు పెరుగుతున్నాయి. దీంతో రోజా హవాకు వ్యతిరేకంగా పార్టీలోనే కొందరు కీలక నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని.. తనను రాజకీయంగా సొంత నేతలే ఇబ్బందులకు గురి చేస్తున్నారని రోజా అంతర్గత చర్చల్లో వ్యాఖ్యానించినట్టు గుప్పుమంది.కాగా.. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా.. రోజా ఇలానే తనను అణిచి వేస్తున్నారంటూ సొంత నేతల పై విమర్శలు చేయడం గమనార్హం. మరి ఇప్పుడు ఆమె వ్యూహం చూస్తే.. ఏకంగా జిల్లాపై పట్టుకోసం ప్రయత్నిస్తు న్నట్టు తెలుస్తోంది. మరి ఎంత వరకు సక్సెస్ అవుతారో చూడాలి.

భారత్-జపాన్ బంధం మరింత బలోపేతం!

టోక్యో: భారత్, జపాన్ మధ్య రక్షణ, వ్యూహాత్మక సంబంధాలు మరో కీలక మలుపు తిరుగుతున్నాయి. మారుతున్న అంతర్జాతీయ పరిణామాలు, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న భద్రతా సవాళ్ల నేపథ్యంలో ఇరు దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు నిర్ణయించాయి. రక్షణ సాంకేతికత అభివృద్ధి, యుద్ధ నౌకల ఆధునికీకరణ, సముద్ర భద్రత, సైనిక సమాచార మార్పిడి వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని అంగీకరించాయి. ముఖ్యంగా యూనికార్న్ ప్రాజెక్టుకు సంబంధించిన రక్షణ ఒప్పందాలను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాయి. టోక్యోలో జరిగిన నాలుగో భారత్--జపాన్ 2+2 విదేశాంగ, రక్షణ మంత్రుల సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటెగి, రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిణామాలపై విస్తృతంగా చర్చించారు.

యూనికార్న్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

భారత్--జపాన్ రక్షణ భాగస్వామ్యంలో యూనికార్న్ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. నౌకాదళ యుద్ధ నౌకల కోసం ప్రత్యేక స్టెల్త్ మాస్ట్ సాంకేతికతను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. యుద్ధ నౌకల్లోని రాడార్, కమ్యూనికేషన్, ఇతర ఎలక్ట్రానిక్ వ్యవస్థలను సమర్థంగా అనుసంధానించే ఈ సాంకేతికత వల్ల శత్రు రాడార్లకు నౌకలు సులభంగా చిక్కకుండా ఉండేందుకు వీలవుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ భారత్‌లోనే అధునాతన రక్షణ పరికరాల తయారీని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి.

'డిజైన్ విత్ జపాన్ -- మేక్ ఇన్ ఇండియా' విధానంలో రక్షణ ఉత్పత్తుల తయారీని విస్తరించేందుకు ఇరు దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. నీటి అడుగున పనిచేసే పరికరాలు, క్షిపణి సాంకేతికత, అధునాతన రక్షణ వ్యవస్థల తయారీలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. దీనివల్ల భారత రక్షణ పరిశ్రమలకు జపాన్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పాటు స్వదేశీ తయారీ సామర్థ్యం పెరగనుంది.

సముద్ర భద్రతకు ఉమ్మడి వ్యూహం

హిందూ మహాసముద్రం, ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లో సముద్ర భద్రతను మరింత పటిష్ఠం చేయడంపై భారత్, జపాన్ ప్రత్యేక దృష్టి సారించాయి. ఇటీవల కుదిరిన సముద్ర భద్రత సహకార ఒప్పందాన్ని త్వరగా అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించాయి. సముద్ర, గగనతల నిఘా, ప్రమాదాల్లో



చిక్కుకున్న వారిని రక్షించడం, కీలక సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం వంటి అంశాల్లో సమన్వయంతో పనిచేయనున్నాయి.

ఇరు దేశాల నౌకాదళాలు పరస్పరం ఒకరి దేశంలోని నౌకా మరమ్మతు కేంద్రాలను మరొకరు వినియోగించుకునేలా ప్రత్యేక ఒప్పందాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నాయి. సముద్రంలో అమర్చిన మందుపాతరలను గుర్తించడం, వాటిని నిర్వీర్యం చేసే సామర్థ్యాలను పెంపొందించుకోవడంపైనా సహకారాన్ని విస్తరించనున్నాయి. ఇప్పటికే ఇరు దేశాల మధ్య సైనిక సహకారం గణనీయంగా పెరిగిందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. భారత్‌లో నిర్వహించిన వీర్ గార్డియన్--2026 వైమానిక విన్యాసాల్లో తొలిసారిగా జపాన్ వైమానిక దళ యుద్ధ విమానాలు పాల్గొనడం కీలక పరిణామమని పేర్కొన్నారు. అక్టోబర్ 13న టోక్యోలో జరిగిన మూడో భారత్--జపాన్ రక్షణ పరిశ్రమల వేదిక సమావేశం కూడా రక్షణ రంగ భాగస్వామ్యానికి దోహదపడిందని తెలిపారు.

బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణమే లక్ష్యం

అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులపైనా ఇరు దేశాల మంత్రులు చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితులు, వాణిజ్య సమస్యలు, సరఫరా వ్యవస్థల్లో ఎదురవుతున్న అవరోధాలు ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, వాణిజ్య భద్రతపై ప్రభావం చూపుతున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో భారత్, జపాన్ వంటి విశ్వసనీయ భాగస్వామ్య దేశాల మధ్య సహకారం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఇరు దేశాలు కలిసి పనిచేయడం ద్వారా ఆసియాలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ కీలక పాత్ర పోషించగలవని అన్నారు. బహుళ ధ్రువ ఆసియా, బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణానికి భారత్--జపాన్ భాగస్వామ్యం దోహదపడుతుందని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కూడా ఇరు దేశాలు గుర్తించాయని తెలిపారు. ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం, ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

క్వాడ్ భాగస్వామ్యంతో ఇండో-పసిఫిక్‌కు భరోసా

ఇండో-పసిఫిక్ ప్రాంతం స్వేచ్ఛగా, బహిరంగంగా, సురక్షితంగా ఉండాలన్న లక్ష్యంతో క్వాడ్ భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేస్తున్నట్లు జైశంకర్ తెలిపారు. సముద్ర మార్గాలు, అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు, సరఫరా వ్యవస్థలను కొన్ని దేశాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించుకునే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో సముద్ర రవాణా నిరంతరాయంగా కొనసాగడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్యంలో సముద్ర మార్గాల ప్రాధాన్యం దృష్ట్యా వాటి భద్రతకు అన్ని దేశాలు బాధ్యత తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

యుద్ధ స్వరూపం కూడా వేగంగా మారుతోందని, స్మార్ట్ ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ఆధారిత రక్షణ వ్యవస్థల ప్రాధాన్యం పెరుగుతోందని జైశంకర్ వివరించారు. ఈ రంగాల్లో భారత్, జపాన్ కలిసి పనిచేస్తే రక్షణ సామర్థ్యాలు పెరగడమే కాకుండా పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు కూడా కొత్త అవకాశాలు లభిస్తాయని అన్నారు.

75 ఏళ్ల దౌత్య బంధానికి ముందస్తు సన్నాహాలు

భారత్--జపాన్ దౌత్య సంబంధాలకు 2027లో 75 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ చారిత్రక మైలురాయికి ముందుగానే రక్షణ, భద్రత, సాంకేతిక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. 2025 ఆగస్టులో కుదిరిన భద్రతా సహకార ఉమ్మడి ప్రకటన అమలులో భాగంగా తాజా చర్చలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2026లోనే రాజ్‌నాథ్ సింగ్, జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి మధ్య ఇది మూడో సమావేశం కావడం ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రక్షణ సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

జపాన్ నౌకాదళ స్థావరాన్ని సందర్శించిన రాజ్‌నాథ్

సమావేశం అనంతరం భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జపాన్‌లోని యోకోసుకా నౌకాదళ స్థావరాన్ని సందర్శించారు. జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమితో కలిసి మొగామి తరగతికి చెందిన బహుళ ప్రయోజన యుద్ధ నౌక జేఎస్ నాటోరిని పరిశీలించారు. జపాన్ నౌకాదళ ఆధునికీకరణ, అధునాతన యుద్ధ నౌకల సామర్థ్యాలను ఆయనకు వివరించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ వివాదాలను అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. ప్రపంచవ్యవస్థలో ప్రతి దేశం తన బాధ్యతను పెంచుకోవాల్సిన ప్రస్తుత తరుణంలో భారత్--జపాన్ భాగస్వామ్యం మరింత కీలకంగా మారుతోందని జైశంకర్ పేర్కొన్నారు.

వచ్చే 20 ఏళ్ల పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'!

న్యూఢిల్లీ: భారత్‌ను ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా, స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దాలంటే పారిశ్రామిక రంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. రాబోయే 20 ఏళ్లలో పరిశ్రమలు తీసుకునే ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయంలోనూ 'ఇండియా ఫస్ట్' అనే ఆలోచనే ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పెట్టుబడులను గణనీయంగా పెంచాలని, దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. దేశాభివృద్ధికి అవసరమైన సంస్కరణలపై పరిశ్రమల ప్రతినిధులు ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా తనకు సూచనలు చేయవచ్చని స్పష్టం చేశారు. దిల్లీలో నిర్వహించిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశం, వార్షిక సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. 'భారత్ 2047' లక్ష్యంగా దేశ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, అంతర్జాతీయ మార్కెట్లలో భారత స్థానం, స్వదేశీ తయారీ వంటి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. పరిశ్రమలు, రైతులు, చిన్న వ్యాపారులు, సంపద సృష్టికర్తలు, పన్నులు చెల్లించే వారిని గౌరవించినప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

గాంధీజీ స్వదేశీ సందేశాన్ని గుర్తుచేస్తూ..

దేశీయ ఉత్పత్తులు, స్వయం సమృద్ధి గురించి మహాత్మాగాంధీ 1930లో ఇచ్చిన సందేశాన్ని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు వందేళ్లు గడిచినా స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని మళ్లీ చెప్పాల్సిన పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. భారత పరిశ్రమలు దేశీయంగా తయారయ్యే వస్తువుల నాణ్యతను పెంచి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో దేశ ఆర్థిక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలు పెట్టుబడులు పెట్టాలని కోరారు.

పరిశ్రమలకు మిత్రుడిగా ప్రభుత్వం

గత ప్రభుత్వాల సమయంలో పరిశ్రమలు ఎదుర్కొన్న అనుభవాలు అంత సానుకూలంగా ఉండేవి కావని మోదీ వ్యాఖ్యానించారు. ఆ ప్రభావం ఇప్పటికీ పరిశ్రమలకు, ప్రభుత్వానికి మధ్య సంబంధాల్లో కనిపిస్తోందని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమలను భాగస్వాములుగా, మిత్రులుగా చూస్తోందని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి ఇంకా ఎలాంటి విధానపరమైన మార్పులు అవసరమో పరిశ్రమల ప్రతినిధులు బహిరంగంగా తెలియజేయాలని కోరారు. భయం, సంకోచం లేకుండా నేరుగా తనకు లేఖలు రాయవచ్చని చెప్పారు. పరిశ్రమల నుంచి వచ్చే నిర్మాణాత్మక సూచనలను ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.

వ్యవసాయ అనుబంధ రంగాల్లో భారీ పెట్టుబడులు

దేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలకమని, ఈ రంగంలో పరిశ్రమలు మరింత పెట్టుబడులు పెట్టాలని ప్రధాని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ఏయే దేశాల్లో డిమాండ్ ఉందో



గుర్తించి, అందుకు అనుగుణంగా ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. విదేశీ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచి పంటలను సేకరించే పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెరిగితే రైతులకు మెరుగైన ఆదాయం లభించడంతో పాటు భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వస్తుందని అభిప్రాయపడ్డారు.

ఔషధ తయారీలో దిగుమతులపై ఆధారమెందుకు?

ఔషధ తయారీ రంగంలో భారత్ మరింత స్వయం సమృద్ధి సాధించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలకు మందులు సరఫరా చేసే స్థాయిలో భారత్ ఎదిగినప్పటికీ, ఔషధ తయారీకి అవసరమైన కీలక ముడి పదార్థాల విషయంలో విదేశాలపై ఆధారపడాల్సి వస్తోందని గుర్తుచేశారు. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్ బల్క్ డ్రగ్స్, ఔషధ తయారీలో ఉపయోగించే ఇతర మధ్యవర్తి పదార్థాలను భారీగా దిగుమతి చేసుకుంటున్నామని పేర్కొన్నారు. వీటిలో దేశీయంగా తయారు చేయగలిగే ఉత్పత్తులను గుర్తించి, ఆధునిక సాంకేతికతతో భారీ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పరిశ్రమలకు సూచించారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గితే ఔషధ రంగంలో భారత్ మరింత బలపడుతుందని చెప్పారు.

ఉద్యోగుల జీతాలు పెంచారా?

పన్నుల విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను ప్రస్తావిస్తూ పరిశ్రమలకు మోదీ కీలక ప్రశ్న సంధించారు. 2014లో 30 శాతంగా ఉన్న ప్రాథమిక కార్పొరేట్ పన్ను రేటును 22 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంలోనూ సంస్కరణలు చేపట్టామని, కొత్త పన్ను విధానంలో ఏడాదికి రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను భారం లేకుండా చేశామని వివరించారు. పన్ను రిటర్నుల దాఖలు, రిఫండ్ ప్రక్రియలను సులభతరం చేశామని పేర్కొన్నారు. గతంలో పన్ను వాపసు రావడానికి నెలల సమయం పట్టేదని, ఇప్పుడు అనేక సందర్భాల్లో వారంలోపే రిఫండ్ అందుతోందని చెప్పారు. అయితే ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను తగ్గించినప్పుడు పరిశ్రమలు తమ ఉద్యోగుల సంఖ్యను పెంచాయా? వారి వేతనాలను కూడా పెంచాయా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం కల్పిస్తున్న పన్ను రాయితీల ప్రయోజనాలు కేవలం సంస్థలకే పరిమితం కాకుండా ఉద్యోగులకు, కార్మికులకు కూడా చేరాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ

గత పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని మోదీ వివరించారు. లైసెన్స్ కోటా రాజ్, జాతీయీకరణ విధానాల నుంచి ఒక దశలో ప్రపంచంలోని బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన పరిస్థితులను ప్రస్తావించారు. గత 12--13 ఏళ్లలో ప్రజలు, రైతులు, యువత, కార్మికులు, పారిశ్రామిక రంగం చేసిన కృషితో దేశ ఆర్థిక పరిస్థితి గణనీయంగా మారిందని చెప్పారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోందని, దాదాపు 7 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయని తెలిపారు.

నాణ్యత విషయంలో రాజీ వద్దు

ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావిస్తూ గత 12--13 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని పేర్కొన్నారు. అక్టోబర్‌లో భారత వస్తు ఎగుమతులు దాదాపు 50 బిలియన్ డాలర్లకు చేరాయని, ఇది ఒక నెలలో నమోదైన అత్యధిక స్థాయి అని వెల్లడించారు. భారతీయ వినియోగదారులను పరిశ్రమలు తక్కువగా అంచనా వేయకూడదని సూచించారు. ఎగుమతుల కోసం తయారు చేసే వస్తువులకే అత్యుత్తమ నాణ్యత ఉంటుందనే భావనను మార్చుకోవాలని అన్నారు. దేశీయ వినియోగదారులకు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని స్పష్టం చేశారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో కొత్త అవకాశాలు

భారత్ పలు ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని మోదీ గుర్తుచేశారు. వీటి ద్వారా భారత పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని ఎగుమతులను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు అనుగుణంగా పరిశ్రమలు కూడా తమ విధానాలను మార్చుకోవాలని, స్వదేశీ తయారీ, నాణ్యత, సాంకేతికత, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం, పరిశ్రమలు సమన్వయంతో పనిచేస్తే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫిక్కీ శతాబ్ది ఉత్సవాలకు ముందస్తు అడుగు

'భారత్ 2047' ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సుకు పరిశ్రమల ప్రముఖులు, సంస్థల అధిపతులు, రాయబారులు, దౌత్యవేత్తలు, విధాన నిర్ణేతలు సహా 2,500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. 1927లో ఏర్పాటైన ఫిక్కీ 2027 ఏప్రిల్ 7తో వందేళ్లు పూర్తి చేసుకోనుంది. మొత్తంగా ప్రధాని సందేశం ఒక్కటే.. రాబోయే రెండు దశాబ్దాలు భారత ఆర్థిక భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. ఈ కాలంలో పరిశ్రమలు విదేశీ మార్కెట్లపైనే కాకుండా దేశీయ ఉత్పత్తి సామర్థ్యం, రైతుల ఆదాయం, ఉద్యోగుల సంక్షేమం, నాణ్యత, సాంకేతికతపై దృష్టి సారించాలి. ప్రతి పెట్టుబడి వెనుక దేశ ప్రయోజనం ఉండాలన్న 'ఇండియా ఫస్ట్' నినాదంతో ముందుకు సాగాలని మోదీ పిలుపునిచ్చారు.

సైనిక చర్యపై రాజకీయ రగడ

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో రెవెన్యూ మంత్రి జగత్ సింగ్ నేగి చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. రాఫెల్ ఫైటర్ జెట్ల కొనుగోలు ధరపై అవినీతి ఆరోపణలు చేస్తూ..'ఆపరేషన్ సిందూర్' సమయంలో సైన్యం, రాఫెల్ పనితీరుపై ఆయన చేసిన వ్యాఖ్యలపై గురువారం సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అసెంబ్లీ చర్చ సందర్భంగా మంత్రి జగత్ సింగ్ నేగి మాట్లాడుతూ.. రూ. 700 కోట్ల విలువైన రాఫెల్ యుద్ధ విమానాన్ని రూ. 2,300 కోట్లకు కొనుగోలు చేశారని, ఆ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని ఆరోపించారు. అదేమైనా బంగారు, వెండి జెట్టా? అని ప్రశ్నిస్తూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌పై అనుకున్న స్థాయిలో ఒత్తిడి తీసుకురాలేకపోయామని, పైగా మనకే కఠిన పరిస్థితులు ఎదురయ్యాయనే అర్థంలో వ్యాఖ్యానించారు.

అసెంబ్లీలో రగడ.. బీజేపీ వాకౌట్

మంత్రి వ్యాఖ్యలపై గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష బీజేపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్, భారత సైన్యంపై చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని, మంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. దీనిపై స్పందించిన మంత్రి జగత్ సింగ్ నేగి క్షమాపణ చెప్పేందుకు నిరాకరించారు. నవంబర్ 18 నాటి అసెంబ్లీ చర్చల రికార్డు కాపీని సభ ముందు ఉంచుతూ.. తాను తప్పుగా ఏమీ మాట్లాడలేదని, అప్పట్లోనే అభ్యంతరం చెప్పకుండా ఇప్పుడు క్షమాపణ ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించారు. మంత్రి సమాధానంతో అసంతృప్తి వ్యక్తం చేసిన బీజేపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. సభ బయట, సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. సైన్యం శౌర్యాన్ని, ఆపరేషన్ సిందూర్‌ను కించపరిచేలా మాట్లాడటం శోచనీయమని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలను ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సమర్థిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు హర్ష్ మహాజన్ కూడా మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ, జాతీయ భద్రత, రక్షణ అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

పహల్గామ్ దాడి

గతేడాది (2025) ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. మతపరమైన ఉద్రిక్తతలు రేకెత్తించడం, కాశ్మీర్ పర్యాటక రంగం ద్వారా నెలకొన్న ప్రశాంతతను దెబ్బతీయడం లక్ష్యంగా ఈ దాడి జరిగిందని అధికారులు పేర్కొన్నారు. దీనికి లష్కర్-ఎ-తొయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ బాధ్యత వహించింది. ఈ ఘటనకు ప్రతిస్పందనగా భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడులు నిర్వహించడంతో పాటు, సరిహద్దుల్లో నిఘా, భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. సింధు జల ఒప్పందం నిలిపివేత వంటి కఠిన దౌత్య నిర్ణయాలకు దారితీసిన ఈ పరిణామాలు, కాశ్మీర్ పర్యాటకంపై తాత్కాలిక ప్రభావం చూపినప్పటికీ, ఉగ్రవాదంపై దేశవ్యాప్తంగా ఐక్యతను, కఠిన వైఖరిని చాటిచెప్పాయి.

భారత ప్రజాస్వామ్యం పవిత్రమైనది..

న్యూఢిల్లీ: భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లు, ఓటములు ఉన్నప్పటికీ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయనే కారణంతో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరిస్తే దేశ ప్రజాస్వామ్యానికి ముగింపు పలికినట్లేనని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమస్యలున్నాయని ఆరోపిస్తూ ఎన్నికలకు దూరంగా ఉండటం తమ పార్టీ విధానం కాదని తేల్చిచెప్పారు. రెండు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా చికాగో విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియపై తమకు ఉన్న అభ్యంతరాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ప్రజాస్వామ్య వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనకుండా ఉంటే ప్రజలకు తమ గొంతు వినిపించే అవకాశం కోల్పోతామని అభిప్రాయపడ్డారు.

ఎన్నికల బహిష్కరణకు కాంగ్రెస్ వ్యతిరేకం

ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయన్న ఆరోపణలతో ఎన్నికలను బహిష్కరిస్తే భారత ప్రజాస్వామ్యం అంతమవుతుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు చేయాలంటే తమ వద్ద 100, 200, 300 శాతం కచ్చితమైన ఆధారాలు ఉండాలని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యకర్తలకు ఎన్నికల్లో పాల్గొనవద్దని పిలుపునిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్న క్షణమే ప్రజాస్వామ్య ప్రక్రియకు నష్టం జరుగుతుందని అన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం కాంగ్రెస్ లక్ష్యం కాదని స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఎన్నికల వ్యవస్థలో ఏం జరుగుతోందో ప్రజలకు వివరించడం, ఎదురయ్యే రాజకీయ ఓటములను భరిస్తూనే పోరాటం కొనసాగించడం తమ వ్యూహమని వెల్లడించారు. ప్రజలు వ్యవస్థలోని సమస్యలను పూర్తిగా గుర్తించే వరకు తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు.

గ్రూప్ రిజర్వేషన్లపై బెర్త్‌ల పరిమితి తొలగింపు..

సమూహాలుగా ప్రయాణించే ప్రయాణికుల కోసం సౌత్ వెస్ట్రన్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. వివాహాలు, విద్యా విహారయాత్రలు, తీర్థయాత్రలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రయాణించే వారి సౌకర్యార్థం బల్క్ (గ్రూప్) టికెట్ బుకింగ్ నిబంధనలను సవరించింది. పాత నిబంధనల స్థానంలో కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తెచ్చినట్లు ఎస్‌డబ్ల్యూఆర్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ మంజునాథ్ కనమడి వెల్లడించారు. తాజా నిబంధనల ప్రకారం... గ్రూప్ టికెట్ల బుకింగ్‌పై ఉన్న గరిష్ఠ బెర్తుల పరిమితిని ఎస్‌డబ్ల్యూఆర్ పూర్తిగా ఎత్తివేసింది. అంతేకాకుండా, ఈ బుకింగ్‌లకు అనుమతి ఇచ్చే అధికారాన్ని డివిజనల్ కార్యాలయాల నుంచి స్థానిక స్టేషన్లకే అప్పగించారు. ప్రధాన రిజర్వేషన్ కేంద్రాల్లోని స్టేషన్ మేనేజర్లు, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్లు ఇకపై ఎలాంటి ముందస్తు బెర్త్ పరిమితి లేకుండా గ్రూప్ బుకింగ్‌లను ఆమోదించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. సాధారణ అడ్వాన్స్ రిజర్వేషన్ సమయం ప్రారంభమైన గంట తర్వాత, అంటే ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి ఈ దరఖాస్తులను స్వీకరిస్తారు. అన్ని తరగతుల్లో కన్ఫర్మ్, ఆర్ఏసీ లేదా వెయిటింగ్ లిస్ట్ టిక

రూ.7.5 లక్షల కోట్ల పండగ

పెళ్లిళ్ల సీజన్‌లో భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త జోష్!

నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు 52 లక్షల వివాహాలు

దేశవ్యాప్తంగా రూ.7.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని సీఏఐటీ వెల్లడి

ఒక్క ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనే రూ.2.5 లక్షల కోట్ల మేర లావాదేవీల అంచనా

కొనుగోళ్లలో రూ.1.2 లక్షల కోట్లతో బంగారు ఆభరణాలదే అగ్రస్థానం

వేదికలు, హోటళ్లు, మండపాల ద్వారా మరో రూ.60 వేల కోట్ల ఆదాయం



భారతదేశంలో మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్ దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊపును తీసుకురానుంది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు కేవలం 25 రోజుల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా సుమారు 52 లక్షల వివాహాలు జరగనున్నాయని అంచనా. వీటి ద్వారా ఏకంగా రూ.7.5 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు నమోదవుతాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అంచనా వేసింది. ఈ ముహూర్తాల సీజన్.. రిటైల్, తయారీ, ఆతిథ్యం, రవాణా రంగాలకు అతిపెద్ద చోదక శక్తిగా మారనుందని వ్యాపారుల సమాఖ్య వెల్లడించింది. పెళ్లిళ్ల కేవలం శుభకార్యాలుగానే కాకుండా వ్యాపారులు, తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, చేతివృత్తుల కళాకారులు, సేవా రంగాలకు అండగా నిలిచే భారీ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందాయని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ స్పష్టం చేశారు. ఒక్క ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోనే దాదాపు 5 లక్షల వివాహాలు జరగనుండగా, అక్కడ ఏకంగా రూ.2.5 లక్షల కోట్ల మేర వ్యాపారం సాగుతుందని అంచనా వేశారు. ఈ మొత్తం రూ.7.5 లక్షల కోట్ల ఖర్చులో సుమారు రూ.4 లక్షల కోట్లు (54 శాతం) వస్తువులు, రిటైల్ కొనుగోళ్ల ద్వారా సమకూరనుండగా.. సర్వీసుల రంగం రూ.3.45 లక్షల కోట్ల వాటాను దక్కించుకోనుంది. వినియోగ వ్యయంలో సింహభాగం ఆభరణాలు, దుస్తులదే కానుంది. బంగారం, వజ్రాభరణాల కొనుగోళ్లు రూ.1.2 లక్షల కోట్లకు చేరనుండగా, వస్త్ర శ్రేణి రూ.90,000 కోట్ల వాటాతో తర్వాతి స్థానంలో నిలిచింది. గిఫ్ట్‌లు, ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్, స్వీట్లు కూడా భారీగా అమ్ముడుపోనున్నాయి. సేవల విభాగంలో క్యాటరింగ్ రంగానికి రూ.75,000 కోట్లు, కల్యాణ మండపాలు, బాంక్వెట్ హాళ్లు, హోటళ్లకు మరో రూ.60,000 కోట్ల వ్యాపారం సమకూరనుంది. గత కొన్నేళ్లుగా వివాహ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తోంది. 2022లో రూ.3.75 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిమాణం ఏటేటా పెరుగుతూ ఈ ఏడాది రూ.7.50 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరింది. అంతేకాకుండా, ఈ సీజన్ ద్వారా దాదాపు 1.25 కోట్ల మందికి తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

బిజినెస్

స్టాక్ మార్కెట్లలో బుల్ రన్..

83,000 దాటిన సెన్సెక్స్, నిఫ్టీ జోరు!

సెన్సెక్స్ 989 పాయింట్లు పెరిగి 83,021 వద్ద ముగింపు

286 పాయింట్ల లాభంతో 25,514కు చేరిన నిఫ్టీ

ఆటో రంగం జోరు.. 4 శాతానికి పైగా పెరిగిన నిఫ్టీ ఆటో సూచీ

సరికొత్త ఆల్‌టైమ్ హై 63,053.25ను తాకిన నిఫ్టీ బ్యాంక్

విదేశీ పెట్టుబడులు, ముడిచమురు ధరల తగ్గింపు మార్కెట్లకు ఊతం



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో దూసుకెళ్లాయి. ఆటోమొబైల్, బ్యాంకింగ్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో ప్రధాన సూచీలు ఒక శాతానికి పైగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 989.94 పాయింట్లు (1.21 శాతం) ఎగబాకి 83,021.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 286.35 పాయింట్లు (1.14 శాతం) లాభపడి తిరిగి 25,514.30 స్థాయిని చేరుకుంది. ఆటో రంగ షేర్లు మార్కెట్ ర్యాలీకి ప్రధాన చోదక శక్తిగా నిలిచాయి. నిఫ్టీ ఆటో సూచీ ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 4 శాతానికి పైగా పెరిగి ట్రెండ్‌ను నడిపించింది. మారుతి సుజుకి, ఐషర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు భారీ లాభాలతో ముందువరుసలో నిలిచాయి. అటు బ్యాంకింగ్ రంగం సైతం సరికొత్త చరిత్ర సృష్టించింది. నిఫ్టీ బ్యాంక్ సూచీ జీవితకాల గరిష్ఠ స్థాయి 63,053.25ను తాకి సరికొత్త రికార్డు నమోదు చేసింది. పీఎస్‌యూ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) నిరంతర పెట్టుబడులు, అంతర్జాతీయంగా తగ్గుముఖం పట్టిన ముడిచమురు, రాగి ధరలు భారత మార్కెట్లకు బలమైన మద్దతుగా నిలిచాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల ఆందోళనలతో ఐటీ రంగం కాస్త ఒత్తిడికి లోనైనప్పటికీ, దేశీయ డిమాండ్‌తో ముడిపడి ఉన్న రంగాలపై మదుపర్లు ఆసక్తి చూపించారు. సాంకేతికంగా నిఫ్టీ 25,500 స్థాయిని దాటి నిలకడగా కొనసాగితే రాబోయే రోజుల్లో 25,800 నుంచి 26,000 స్థాయిలను తాకే అవకాశం ఉందని, కింద వైపు 25,400 స్థాయి తక్షణ మద్దతుగా పనిచేస్తుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఆ బగ్ వల్లే అంత గందరగోళం..

మైక్రోసాఫ్ట్ వైఫల్యాన్ని ఒప్పుకున్న సత్య నాదెళ్ల

మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయంపై సీఈవో సత్య నాదెళ్ల విచారం

సమస్యను ముందే నివారించడంలో మరింత మెరుగ్గా ఉండాల్సిందన్న నాదెళ్ల

నిద్రాణంగా ఉన్న సాఫ్ట్‌వేర్ బగ్, భారీ ట్రాఫిక్ వల్లే సమస్య తలెత్తినట్లు వెల్లడి

టెస్టింగ్ దశలోనే లోపాన్ని గుర్తించి ఉండాల్సిందని నాదెళ్ల అంగీకారం

ఔట్‌లుక్, టీమ్స్, కోపైలట్, ఎంఎస్ 365 సేవలు దాదాపు రోజంతా స్తంభన



ఇటీవల మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవల్లో తలెత్తిన భారీ ప్రపంచవ్యాప్త అంతరాయంపై ఆ సంస్థ సీఈవో సత్య నాదెళ్ల విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో యూజర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఈ సమస్యను ముందే నివారించడంలో తాము మరింత మెరుగ్గా పనిచేసి ఉండాల్సిందని ఆయన అంగీకరించారు. సీఎన్‌బీసీతో మాట్లాడిన ఆయన.. సాఫ్ట్‌వేర్‌లో నిద్రాణంగా ఉన్న ఒక బగ్ ఒక్కసారిగా నిర్దిష్ట యూజర్ ట్రాఫిక్‌ను ఎదుర్కోవడంతోనే ఈ వ్యవస్థ కుప్పకూలిందని స్పష్టం చేశారు. టెస్టింగ్ ప్రక్రియలోనే ఇలాంటి లోపాలను గుర్తించడంలో విఫలమయ్యామని, ఒక చిన్న లోపం ప్రపంచవ్యాప్తంగా వ్యాపించకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుని ఉండాల్సిందని నాదెళ్ల పేర్కొన్నారు. గత వారం తొలుత ఔట్‌లుక్‌లో మొదలైన ఈ అంతరాయం.. ఆ తర్వాత క్రమంగా టీమ్స్, కోపైలట్, మైక్రోసాఫ్ట్ 365, షేర్‌పాయింట్, వన్‌డ్రైవ్ వంటి కీలక సేవలన్నింటికీ పాకింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులు దాదాపు ఒక రోజుకు పైగా సేవలందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రాథమిక నివేదికల ప్రకారం ఈ ఏడాది మొదట్లోనే సిస్టమ్‌లోకి ప్రవేశించిన ఈ సాఫ్ట్‌వేర్ బగ్‌తో పాటు, విపరీతమైన ట్రాఫిక్, సర్వర్ సామర్థ్యం తగ్గడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని తేలింది. అయితే దీని వెనుక ఎలాంటి సైబర్ దాడి ఆనవాళ్లు లేవని సంస్థ స్పష్టం చేసింది. ఈ పరిణామం మొత్తం టెక్ పరిశ్రమ ఎదుర్కొంటున్న విస్తృత సవాలును ప్రతిబింబిస్తోందని నాదెళ్ల విశ్లేషించారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ద్వారా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, లోపాల గుర్తింపు వేగవంతమైనప్పటికీ.. ఆ ప్యాచ్‌లను అంతే వేగంగా పాత సాంకేతిక వాతావరణంలోకి చేర్చడం ఆపరేషనల్ రిస్కులకు దారితీస్తోందని ఆయన హెచ్చరించారు. కొత్త అప్‌డేట్‌లను పాత వ్యవస్థలు తట్టుకోలేకపోవడం వల్ల ఇలాంటి అనుకోని సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

తొలి రోజే న్యూజిలాండ్ రివర్స్ ఎటాక్

బుమ్రా దెబ్బకొట్టినా నిలబడ్డ కివీస్ మిడిలార్డర్!


తొలి రోజు ఆట ముగిసేసరికి న్యూజిలాండ్ స్కోరు 243/5

నికోల్స్ 113 నాటౌట్, ఫిలిప్స్ 94 నాటౌట్‌గా క్రీజులో

ఆరో వికెట్‌కు అజేయంగా 173 పరుగులు రాబట్టిన జోడి

70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఆదుకున్న బ్యాటర్లు

బేసిన్ రిజర్వ్‌లో నికోల్స్‌కు ఇది ఐదో టెస్టు శతకం



బేసిన్ రిజర్వ్ వేదికగా భారత్‌తో ప్రారంభమైన తొలి టెస్టులో హెన్రీ నికోల్స్ అజేయ సెంచరీ, గ్లెన్ ఫిలిప్స్ మెరుపు బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ పటిష్ఠ స్థితికి చేరుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేపట్టిన కివీస్ జట్టు ఓ దశలో భారత పేసర్ల ధాటికి 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో నికోల్స్, ఫిలిప్స్ జోడి తిరుగులేని పోరాట పటిమను కనబరిచి అజేయంగా 173 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు 82 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగులు చేసింది. నికోల్స్ 221 బంతుల్లో అజేయంగా 113 పరుగులు సాధించాడు. ఈ మైదానంలో ఆడిన 15 ఇన్నింగ్స్‌లలో అతనికిది ఐదో టెస్టు సెంచరీ కావడం విశేషం. మరోవైపు ఫిలిప్స్ 182 బంతుల్లో 94 పరుగులతో నాటౌట్‌గా నిలిచి త్రుటిలో శతకం చేజార్చుకునే పరిస్థితికి చేరినా, క్రీజులో పాతుకుపోయాడు. వీరిద్దరూ ఆఖరి సెషన్‌లో వికెట్ పడకుండా 100కు పైగా పరుగులు జోడించి భారత బౌలర్లపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. వ్యక్తిగత స్కోరు 102 వద్ద నికోల్స్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ సమన్వయ లోపంతో నేలపాలు చేసి లైఫ్ ఇచ్చారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 17 ఓవర్లలో 52 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కాంబోజ్ ఒక వికెట్, ఆకాశ్ దీప్ ఒక వికెట్ తీశారు. టామ్ బ్లండెల్ వికెట్‌ను కాంబోజ్ తీసినప్పటికీ, ఆ తర్వాత భారత బౌలర్లు కివీస్ జోడీని విడదీయలేకపోయారు. వాషింగ్టన్ సుందర్, ప్రసిద్ధ్ కృష్ణ వికెట్లు తీయడంలో విఫలమయ్యారు. ప్రారంభంలో పైచేయి సాధించిన భారత్‌ను నికోల్స్, ఫిలిప్స్ దెబ్బకొట్టడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి మ్యాచ్ ఆసక్తికరంగా మారింది.

సిరాజ్‌ను అందుకే తుది జట్టు నుంచి తప్పించాం..

కోచ్ కోటక్ వివరణ!

సిరాజ్‌ను పక్కనపెట్టడం ఏమాత్రం తప్పు కాదన్న అసిస్టెంట్ కోచ్ కోటక్

పిచ్ పరిస్థితులు, ఐదు రోజుల ఆటను దృష్టిలో ఉంచుకునే జట్టు ఎంపిక

సిరాజ్ ప్రపంచ స్థాయి బౌలరే అయినా పరిస్థితుల కోసమే తప్పించామని వెల్లడి

గడ్డి పిచ్‌పై ఇద్దరు సీమ్, ఇద్దరు స్పిన్ పేసర్లతో బరిలోకి దిగిన భారత్

కివీస్ టాప్ ఆర్డర్‌లో నలుగురు లెఫ్ట్‌హ్యాండర్లు ఉండటంతో సుందర్‌కు చోటు



న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించడంపై టీమిండియా అసిస్టెంట్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టతనిచ్చాడు. సిరాజ్ ప్రపంచ స్థాయి బౌలర్ అయినప్పటికీ, పిచ్ పరిస్థితులకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామన్నాడు. ఇందులో ఎలాంటి తప్పిదం లేదని అతడు గట్టిగా సమర్థించుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్.. పేసర్ల ఎంపిక, జట్టు కూర్పు వెనుక ఉన్న వ్యూహాలను వివరించాడు. అనుభవజ్ఞుడైన సిరాజ్‌ను ఈ మ్యాచ్‌లో పక్కనపెట్టడం తప్పు కాదని కోటక్ స్పష్టం చేశారు. "నా దృష్టిలో ఇది ఏమాత్రం తప్పుడు నిర్ణయం కాదు. జట్టు యాజమాన్యం పిచ్ పరిస్థితులు, ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేసి అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను బరిలోకి దించింది. ఇటీవల సిరాజ్ శ్రీలంకలో ఆడిన పరిస్థితులు వేరు, ఇక్కడి పరిస్థితులు వేరు. సిరాజ్‌కు ఎలాంటి సమస్యా లేదు. ఇది కేవలం పరిస్థితుల ఆధారంగా తీసుకున్న నిర్ణయం మాత్రమే" అని పేర్కొన్నారు. బేసిన్ రిజర్వ్ పిచ్‌పై దట్టమైన గడ్డి ఉండటం వల్ల వేగం, సీమ్, స్వింగ్ రాబట్టగల కాంబినేషన్‌కు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. ఇద్దరు సీమ్ బౌలర్లు, ఇద్దరు స్పిన్ బౌలర్లు అవసరమనే ఉద్దేశంతోనే ఈ పేస్ దాడిని ఎంచుకున్నామన్నారు. కేవలం తొలి రోజు మాత్రమే కాకుండా ఐదు రోజుల ఆటను దృష్టిలో పెట్టుకుని బౌలర్లను ఎంపిక చేశామని వివరించారు. యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ వేగం తగ్గడంపై స్పందిస్తూ.. మూడో స్పెల్‌లో కాస్త వేగం తగ్గినా ఆరంభంలో మంచి వేగంతోనే బౌలింగ్ చేశాడని కోటక్ వెనకేసుకొచ్చారు. పిచ్‌పై గడ్డి ఉన్నప్పుడు బంతి నెమ్మదిగా వస్తే బ్యాటర్లకు షాట్లు ఆడే సమయం దొరుకుతుందని, అందుకే పేస్ చాలా కీలకమని పేర్కొన్నారు.

స్పోర్ట్స్

'టైమ్ 100 నెక్స్ట్-ఇండియా'

జాబితాలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ

మారుతున్న భారతదేశానికి వైభవ్ ప్రతీక అంటూ ఆయుష్మాన్ ప్రశంసలు

విభిన్నంగా ఆలోచించేవారికే భవిష్యత్తు సొంతమని పేర్కొన్న నటుడు

జాబితాలో నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్, చెస్ ఛాంపియన్ డి.గుకేశ్

క్రీడాకారులు సానియా మీర్జా, లప్లీనా, మీరాబాయి చానులకు సైతం స్థానం

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే 100 మందితో కూడిన ప్రత్యేక జాబితా



భారత క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును దక్కించుకున్నాడు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న 100 మంది అసాధారణ యువ నాయకులు, ఎదుగుతున్న ప్రతిభావంతులతో ప్రతిష్ఠాత్మక 'టైమ్' పత్రిక రూపొందించిన తొలి 'టైమ్ 100 నెక్స్ట్ - ఇండియా' జాబితాలో వైభవ్‌కు చోటు దక్కింది. ఈ సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా యువ బ్యాటర్‌ను ఆకాశానికెత్తుతూ ఒక ప్రత్యేకమైన నోట్‌ను రాశారు. వైభవ్ మారుతున్న నవ భారతానికి అసలైన ప్రతీక అని కొనియాడారు. మైదానంలో బ్యాట్ పట్టుకుని వైభవ్ బంతిని బాదుతున్నప్పుడు, విభిన్నంగా ఆలోచించే వారికే భవిష్యత్తు సొంతమని గుర్తుచేస్తాడని ఆయుష్మాన్ పేర్కొన్నారు. అతడు కేవలం క్రీడా విస్మయం మాత్రమే కాదని, అంతకుమించి ఎంతో విశిష్టమైన వ్యక్తిత్వమని ప్రశంసించారు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడని, ఏడాది వ్యవధిలోనే రికార్డు స్థాయి ప్రదర్శనలతో దూసుకుపోతున్నాడని గుర్తుచేశారు. ప్రతిభ అనేది ఎక్కడి నుంచైనా పుట్టుకొస్తుందని చెప్పడానికి వైభవ్ ప్రయాణమే నిదర్శనమని, అతడి విజయాలు కోట్ల మంది భారతీయులకు పెద్ద కలలు కనే ధైర్యాన్ని ఇస్తాయని ఆయుష్మాన్ కొనియాడారు. అతడి అసలైన విజయం పరుగులు చేయడంలో మాత్రమే కాదని, అసాధారణ స్థాయికి ఎదిగే స్వేచ్ఛ దొరికినప్పుడు ఏం జరుగుతుందో చూపించాడని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో వైభవ్‌తో పాటు భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, బాక్సర్ లప్లీనా బోర్గొహైన్, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రపంచ చెస్ ఛాంపియన్ డి. గుకేశ్, మాజీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, భారత మహిళా హాకీ జట్టు గోల్‌కీపర్ సవితా పునియా, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేతలు విత్య రామ్‌రాజ్, కుకుమ్ మోహోద్ కూడా చోటు దక్కించుకున్నారు.

సంపాదకీయం

ఏఐ బబుల్ బద్ధలైతే..?


ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కొత్త మలుపు తిప్పగల కృత్రిమ మేధ (ఏఐ) ఇప్పుడు మరో చర్చకు కేంద్రంగా మారింది. భవిష్యత్తు సాంకేతిక విప్లవానికి పునాది వేస్తున్న ఏఐపై పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో ఈ పెట్టుబడుల వెనుక వాస్తవ ఆదాయాలు ఉన్నాయా? లేక భవిష్యత్తుపై అతిగా పెంచుకున్న అంచనాలే మార్కెట్‌ను నడిపిస్తున్నాయా? అన్న సందేహాలు పెరుగుతున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి టెక్నాలజీ సంస్థలు ఏఐ అభివృద్ధి, డేటా సెంటర్లు, చిప్స్, సర్వర్లు, విద్యుత్ మౌలిక సదుపాయాల కోసం భారీ మొత్తాలను ఖర్చు చేస్తున్నాయి. ఏఐ రంగంలో వెనుకబడితే భవిష్యత్తులో వ్యాపార అవకాశాలు కోల్పోతామనే భయంతో కంపెనీలు పోటీపడి పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ పోటీ కారణంగా కొన్ని సంస్థల మార్కెట్ విలువలు విపరీతంగా పెరిగాయి. ఏఐతో భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్ని ముందుగానే ఊహించి ప్రస్తుతం కంపెనీల విలువను నిర్ణయించడం జరుగుతోంది. కానీ అంచనాలకు తగ్గట్టుగా ఆదాయాలు వస్తాయా? పెట్టుబడులకు తగిన లాభాలు వస్తాయా? అన్నది ఇంకా స్పష్టత లేని అంశం. ఈ నేపథ్యంలో ఏఐ రంగంలో మరో ఆర్థిక బుడగ ఏర్పడుతోందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. 1990వ దశకం చివరిలో ఇంటర్నెట్‌పై ఏర్పడిన అపారమైన ఆశలు డాట్‌కామ్ బబుల్‌కు దారితీశాయి. ఇంటర్నెట్ భవిష్యత్తును మార్చబోతుందన్న అంచనా నిజమే అయినప్పటికీ, ఆ పేరుతో పుట్టుకొచ్చిన అనేక కంపెనీలు వాస్తవ వ్యాపార నమూనాలు లేకుండానే భారీ విలువలను సంపాదించాయి. చివరకు 2000 ప్రాంతంలో మార్కెట్ కుప్పకూలడంతో అనేక సంస్థలు మూతపడ్డాయి. పెట్టుబడిదారులు భారీ నష్టాలను చవిచూశారు. అయితే ఇంటర్నెట్ మాత్రం అంతరించిపోలేదు. ఆ సంక్షోభం తర్వాత మరింత బలంగా అభివృద్ధి చెందింది. నేటి ఏఐ పెట్టుబడుల పరిస్థితిలోనూ ఇలాంటి పోలికలు కనిపిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం గొప్పదనే కారణంతో ప్రతి కంపెనీ గొప్ప వ్యాపారంగా మారదు. టెక్నాలజీ భవిష్యత్తులో విస్తృతంగా ఉపయోగపడుతుందనే అంచనా, దానిపై పెట్టుబడి పెట్టిన ప్రతి సంస్థ లాభాలు సంపాదిస్తుందనే హామీ కాదు. ఏఐపై ఆశలు సహజమే. కానీ ఆదాయాల కంటే పెట్టుబడుల వేగం పెరగడం, కంపెనీల విలువలను వాస్తవానికి మించి అంచనా వేయడం ఆర్థిక ప్రమాదాలకు దారితీయవచ్చు.

ఏఐ బబుల్ భయాలకు ప్రధాన కారణం ఈ రంగంలో జరుగుతున్న పెట్టుబడుల పరిమాణం, వాటికి తగ్గ ఆదాయాలపై ఉన్న అనిశ్చితి. డేటా సెంటర్ల నిర్మాణం, అత్యాధునిక చిప్స్ కొనుగోలు, విద్యుత్ సరఫరా, క్లౌడ్ మౌలిక సదుపాయాల కోసం కంపెనీలు భారీగా ఖర్చు చేస్తున్నాయి. అయితే ఈ పెట్టుబడుల నుంచి ఆశించిన ఆదాయాలు వెంటనే రావడం లేదు. ఏఐ సేవలకు వినియోగదారులు ఎంత చెల్లిస్తారు? సంస్థలు వాటిని ఎంత విస్తృతంగా స్వీకరిస్తాయి? పెట్టుబడులకు తగిన లాభాలు వస్తాయా? అన్న ప్రశ్నలకు ఇంకా స్పష్టమైన సమాధానాలు లేవు. కొన్ని సంస్థలు అప్పుల ద్వారా పెట్టుబడులను సమకూర్చుకుంటుండగా, మరికొన్ని పరస్పర ఒప్పందాలు, భాగస్వామ్యాలతో వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. ఈ వ్యవస్థలు వృద్ధికి దోహదపడినా, వాస్తవ డిమాండ్‌పై సందేహాలు కూడా పెంచుతున్నాయి. మౌలిక సదుపాయాలు అవసరానికి మించి నిర్మిస్తే, చిప్స్‌కు డిమాండ్ తగ్గితే, విద్యుత్ ఖర్చులు పెరిగితే లేదా ఏఐ సేవల నుంచి ఆశించిన లాభాలు రాకపోతే భారీ పెట్టుబడులు భారంగా మారవచ్చు. కొందరు నిపుణులు కంపెనీల విలువలు, పెట్టుబడుల స్థాయి, అప్పుల పెరుగుదలను బబుల్ సంకేతాలుగా భావిస్తుంటే, మరికొందరు అగ్రశ్రేణి ఏఐ సంస్థలకు బలమైన ఆదాయాలు, నగదు ప్రవాహాలు, ఇప్పటికే స్థిరపడిన వ్యాపార వ్యవస్థలు ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. డాట్‌కామ్ కాలంతో పోలిస్తే ప్రస్తుతం ఏఐలో పెట్టుబడులు పెడుతున్న అనేక సంస్థలకు ఇప్పటికే క్లౌడ్ సేవలు, డిజిటల్ ప్రకటనలు, సాఫ్ట్‌వేర్ వంటి వ్యాపారాల ద్వారా ఆదాయం వస్తోంది. కాబట్టి పెట్టుబడులన్నీ ఊహాగానాలపై ఆధారపడి ఉన్నాయని చెప్పడం సరికాదు. అయితే బలమైన కంపెనీలు కూడా తప్పు నిర్ణయాలు తీసుకోవచ్చు. మార్కెట్ విలువలు వాస్తవ ఆదాయాల కంటే వేగంగా పెరిగితే, అంచనాలు తగ్గినప్పుడు షేర్ల ధరలు పడిపోవచ్చు. కొన్ని సంస్థలు నష్టపోవచ్చు. పెట్టుబడుల ప్రవాహం తగ్గవచ్చు. మార్కెట్‌లో ఆర్థిక దిద్దుబాటు సంభవించే అవకాశాన్ని తోసిపుచ్చలేం.

అయితే మార్కెట్ పతనం, సాంకేతిక పరిజ్ఞానం పతనం రెండూ ఒకటి కావు. షేర్ మార్కెట్ విలువలు కుప్పకూలవచ్చు. అధిక అంచనాలతో పెట్టుబడులు పెట్టిన సంస్థలు నష్టపోవచ్చు. భారీ అప్పులతో విస్తరించిన కొన్ని కంపెనీలు మూతపడవచ్చు. పెట్టుబడిదారుల సంపద తగ్గవచ్చు. కానీ ఏఐ ఇప్పటికే విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, బ్యాంకింగ్, సమాచార రంగాల్లో తన వినియోగాన్ని విస్తరిస్తోంది. భాషా అనువాదం, సమాచార విశ్లేషణ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, వైద్య పరిశోధన, ఆటోమేషన్ వంటి రంగాల్లో మానవ సామర్థ్యాన్ని పెంచే సాధనంగా మారుతోంది. గతంలో రైల్వేలు, విద్యుత్, టెలిఫోన్, ఇంటర్నెట్ రంగాల్లోనూ భారీ పెట్టుబడులు వచ్చాయి. కొన్ని సంస్థలు విఫలమయ్యాయి. అయినప్పటికీ ఆ సాంకేతికతలు సమాజంలో శాశ్వత మార్పులు తీసుకొచ్చాయి.

ఇంటర్నెట్ బబుల్ పగిలిన తర్వాత కూడా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరించింది. ఏఐ విషయంలోనూ ఇదే జరగవచ్చు. ప్రస్తుత ఉత్సాహం తగ్గిన తర్వాత నిజమైన ఉపయోగం, స్థిరమైన ఆదాయం, మెరుగైన ఫలితాలు ఇచ్చే సంస్థలే నిలదొక్కుకునే అవకాశం ఉంది. ఏఐ నిజంగా సమస్యలను పరిష్కరిస్తుందా? ఉత్పాదకతను పెంచుతుందా? ఖర్చులను తగ్గిస్తుందా? అన్నదే ప్రాధాన్యత కావాలి. ప్రభుత్వాలు ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి, విద్య, పరిశోధన, డేటా భద్రతపై దృష్టి పెట్టాలి. సంస్థలు ప్రచారం వెంట పరుగెత్తకుండా వాస్తవ అవసరాలను గుర్తించాలి. పెట్టుబడిదారులు కంపెనీల విలువలు, ఆదాయాలు, అప్పులను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలి. ఏఐ భవిష్యత్తుపై అతిగా ఆశపడటం ఎంత ప్రమాదకరమో, దాని అభివృద్ధిని బబుల్‌గా కొట్టిపారేయడం కూడా అంతే పొరపాటు. మార్కెట్ బుడగ బద్దలవుతుందా? అనేది కాలమే నిర్ణయిస్తుంది. కానీ సాంకేతిక విప్లవం ఒక్క మార్కెట్ పతనంతో ఆగిపోయే అవకాశం లేదు. బుడగలు పగిలినప్పుడు ఊహాగానాలు కరిగిపోతాయి.. నిలిచేది నిజమైన విలువ. ఏఐ విషయంలోనూ చివరకు గెలిచేది ప్రచారం కాదు.. ప్రజలకు, పరిశ్రమలకు ఉపయోగపడే సాంకేతికతే!

పనికొచ్చే పలుకు



ఓటములతోనే గెలుపు సాధ్యం

ఇన్‌స్టాగ్రామ్ తెరిస్తే అందరూ గెలుస్తున్నట్టే కనిపిస్తారు. కొత్త ఉద్యోగాలు, విదేశీ యాత్రలు, ప్రమోషన్లు, పెద్ద ఇళ్లు. మన జీవితం మాత్రం ఎత్తుపల్లాలతో సాగుతుంటే, "నేనే వెనకబడ్డానా?" అనే ప్రశ్న మనసును తొలిచేస్తుంది. ఇలాంటి సమయంలో ప్రపంచ ప్రసిద్ధ మీడియా దిగ్గజం సమ్నర్ రెడ్‌స్టోన్ చెప్పిన మాట ఒక అద్దంలా పనిచేస్తుంది. విజయం విజయాల మీద నిర్మితం కాదని, అది ఓటములు, నిరాశల పునాదిపై నిలుస్తుందని, కొన్నిసార్లు పెను విపత్తుల నుంచే పుడుతుందని అన్నారు ఆయన.

ఇది వినడానికి సులభంగా ఉన్నా, ఆచరణలో కష్టం. ఎందుకంటే మనకు చిన్నప్పటి నుంచి గెలుపునే నేర్పారు, ఓటమిని ఎలా తట్టుకోవాలో ఎవరూ నేర్పలేదు. ఈ మాటకు ఆయన జీవితమే సాక్ష్యం. 1979లో ఒక హోటల్ అగ్నిప్రమాదంలో ఆయన తీవ్రంగా కాలిపోయారు. బతకడం కష్టమని అందరూ అనుకున్నారు. అయినా ఆయన కోలుకుని, తర్వాత మీడియా సామ్రాజ్యాన్ని నిర్మించారు. అంతా ముగిసిందనుకున్న క్షణమే ఆయనకు కొత్త ఆరంభమైంది. అంటే విపత్తు ఆయనను ఆపలేదు, జీవితాన్ని చూసే కోణాన్నే మార్చింది. కష్టం మనల్ని ఆపేది కాదు, మనమెవరో తెలియజేసేది.

సౌకర్యవంతమైన జీవితం నుంచి బయటకు రావడం అలవాటు చేసుకోండి. ఎలాంటి అడ్డంకులు లేని ప్రయాణంలో నిజమైన ఎదుగుదల ఉండదు. ప్రతివారం కొత్త నైపుణ్యం నేర్చుకోవడం, భయపెట్టే పనిని ముందు చేయడం, తెలియని వారితో మాట్లాడటం వంటి చిన్న సవాళ్లు మన మానసిక ధైర్యాన్ని పెంచుతాయి.

ఇక.. పోలికలను తగ్గించండి. సోషల్ మీడియాలో కనిపించేది ఇతరుల ఎంపిక చేసిన విజయాలు మాత్రమే. వారి ఓటములు, నిద్రలేని రాత్రులు అక్కడ కనిపించవు. రోజూ కొంత సమయం ఫోన్‌కు దూరంగా ఉండి, మీ స్వంత పురోగతిని నిన్నటి మీతో పోల్చుకోండి.

ఓటమి వచ్చినప్పుడు నిర్ణయాలను పునఃసమీక్షించుకోండి. మార్పు అసౌకర్యంగా ఉన్నా, అదే కొత్త దారులు తెరుస్తుంది. పరిస్థితులు మారినప్పుడు మన పద్ధతులు మారకపోతే వెనకబడిపోతాం. ఈ రోజుల్లో సాంకేతికత వేగంగా మారుతోంది, పాత నైపుణ్యాలు సరిపోని సందర్భాలు వస్తున్నాయి. అందుకే కాలానికి అనుగుణంగా నేర్చుకుంటూ, మారుతూ ఉండటమే తెలివైన జీవనశైలి. ప్రతి రాత్రి పడుకునే ముందు "ఈ రోజు నేను నేర్చుకున్నదేమిటి?" అని ఒక్క నిమిషం ఆలోచించండి. ఓటమి విలువ తెలిసినవారు గెలిచినప్పుడు గర్వపడరు, ఓడినప్పుడు కుంగిపోరు. వారికి గెలుపు ఓటములు రెండూ గురువులే.

ఐదోది, కష్టకాలంలో ఒంటరిగా ఉండకండి. మనసు భారంగా ఉన్నప్పుడు నమ్మకమైన వారితో మాట్లాడండి, అవసరమైతే నిపుణుల సహాయం తీసుకోండి. మనసు గురించి మాట్లాడటం బలహీనత కాదు, అది బాధ్యత. ధైర్యం అంటే బాధను దాచుకోవడం కాదు, దాన్ని దాటే మార్గం వెతకడం. చిన్న నడక, మంచి నిద్ర, సమయానికి భోజనం వంటి సాధారణ అలవాట్లు కష్టకాలంలో మనసుకు ఊతమిస్తాయి.


మన ఇంట్లో, ఆఫీసులో, స్నేహితుల మధ్య ఎవరైనా ఓడిపోయినప్పుడు నిందించకుండా తోడుగా నిలవడం కూడా ఇదే పాఠాన్ని ఆచరించడం. నిజమైన విజయానికి దారి పూలబాట కాదు, రాళ్లు, ఎత్తుపల్లాలతో నిండిన బాట. ఆ రాళ్లే మన కాళ్లను దృఢం చేస్తాయి. చివరిగా, గెలుపు ఒక క్షణం, ఎదుగుదల ఒక ప్రయాణం. ఈ రోజు మీరు ఏదైనా ఓటమితో బాధపడుతుంటే, దాన్ని చివరి అధ్యాయంగా కాకుండా, ఒక పాఠంగా చూడండి. రేపటి విజయానికి

తుఫానుల హాట్‌స్పాట్.. బీవోబీ!



బంగాళాఖాతంలో అలజడి.. ఆంధ్ర తీరంలో ఆందోళన.. గంటగంటకూ మారుతున్న అంచనాలు.. ఒకవైపు నెమ్మదిగా కదులుతూ, మరోవైపు తీవ్రతను పెంచుకుంటున్న అక్వాన్ తుపాను ఇప్పుడు రాష్ట్రానికి పెను సవాల్. ఇప్పటికే రెండు తుపాన్ల ప్రభావాన్ని ఎదుర్కొన్న ఏపీకి ఇప్పుడు మూడో తుపాను ముప్పు పొంచి ఉంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నవంబర్ 18 మధ్యాహ్నం 1.30 గంటలకు విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం.. అక్వాన్ తీవ్ర తుపానుగా బలపడి దక్షిణ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోంది. ఉదయం 8.30 గంటల సమయానికి ఇది 12.9 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 85.4 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉంది. గత ఆరు గంటల్లో గంటకు ఏడు కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదిలిన ఈ తుపాను రానున్న 24 గంటల్లోనూ అదే దిశలో పయనించే అవకాశముంది. గురువారానికి మరింత బలపడుతూ తీరానికి చేరువయ్యే కొద్దీ దాని గమనం, తీవ్రతపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, తుపాను తీరం దాటే ప్రాంతానికి సంబంధించి వాతావరణ శాఖ అంచనాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకే నెల వ్యవధిలో వరుసగా మూడు తుపాను ముప్పులు ఏర్పడటం వెనుక అనేక వాతావరణ పరిణామాలు పనిచేస్తున్నాయి. సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు బంగాళాఖాతం తుపానుల ఏర్పాటుకు అత్యంత అనుకూలమైన ప్రాంతంగా ఉంటుంది. ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా ఉండే ఈ సమయంలో సముద్రం నుంచి వాతావరణంలోకి అధికంగా తేమ చేరుతుంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అనుకూలంగా ఉన్నప్పుడు ఆవిరి రూపంలో పైకి చేరే వేడి, తేమ అల్పపీడన వ్యవస్థలకు ఇంధనంగా పనిచేస్తాయి. తొలుత అల్పపీడనంగా ఏర్పడిన వ్యవస్థ క్రమంగా వాయుగుండంగా, తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాత తుపానుగా బలపడేందుకు ఈ పరిస్థితులు దోహదపడతాయి. అయితే సముద్రం వేడిగా ఉండటమే తుపాను ఏర్పాటుకు సరిపోదు. వాతావరణంలోని గాలుల దిశ, వేగం, తేమ పంపిణీ, గాలుల నిలువు కోత (వర్టికల్ విండ్ షియర్), వాతావరణ పీడన వ్యత్యాసాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా తుపాను పైభాగంలో వీచే గాలుల వేగం, కిందిస్థాయి గాలుల వేగం మధ్య వ్యత్యాసం తక్కువగా ఉంటే తుపాను తన నిర్మాణాన్ని నిలుపుకుంటూ మరింత బలపడే అవకాశం ఉంటుంది. మరోవైపు, అధిక విండ్ షియర్, పొడి గాలుల ప్రవేశం వంటి పరిస్థితులు తుపాను తీవ్రతను తగ్గించగలవు. ఎల్‌నినో పరిస్థితులు కూడా ఈశాన్య రుతుపవనాల స్వభావం, వర్షపాతం, సముద్ర-వాతావరణ పరస్పర చర్యలపై ప్రభావం చూపగలవు. అయితే ఎల్‌నినో ఒక్కటే వరుస తుపానులకు కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు. సముద్ర ఉష్ణోగ్రతలు, వాతావరణ తేమ, గాలుల కదలిక, హిందూ మహాసముద్రంలోని ఇతర వాతావరణ వ్యవస్థలు కలిసే తుపానుల ఏర్పాటును ప్రభావితం చేస్తాయి. ఒక తుపాను తీరం దాటిన వెంటనే బంగాళాఖాతంలో పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరవు. సముద్రంలో తేమ, ఉష్ణశక్తి కొనసాగడం, వాతావరణంలో అనుకూలమైన గాలుల కదలికలు ఉండటం వల్ల మరో అల్పపీడన వ్యవస్థ ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఒక తుపాను సృష్టించిన వాతావరణ మార్పులు తదుపరి వ్యవస్థ అభివృద్ధిపై కూడా ప్రభావం చూపుతాయి. 2013లో హెలెన్, లెహర్, మాది తుపానులు వరుసగా ఏర్పడిన సందర్భంలోనూ ఇలాంటి సముద్ర, వాతావరణ పరస్పర చర్యలను శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. ఆ పరిశోధనల్లో హిందూ మహాసముద్ర ద్విధ్రువం, ఎల్‌నినో-దక్షిణ డోలనం, సముద్ర ఉష్ణ పరిస్థితులు, పెద్దస్థాయి గాలుల ప్రసరణ వంటి అంశాల సమష్టి ప్రభావం కనిపించింది. అంటే తుపానుల వరుస అనేది ఒకే కారణంతో సంభవించే పరిణామం కాదు. వాతావరణంలోని అనేక అంశాలు ఒకేసారి అనుకూలంగా మారినప్పుడు ఇలాంటి పరిస్థితులు ఏర్పడతాయి. ప్రస్తుత అక్వాన్ తుపాను విషయంలోనూ సముద్ర ఉష్ణోగ్రతలు, తేమ, గాలుల దిశ, పీడన వ్యవస్థల పరిణామాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది. ముఖ్యంగా తుపాను కదలికలో వేగం, దిశ మార్పులు ఎందుకు చోటుచేసుకుంటున్నాయనే అంశం దాని తీరప్రాంత ప్రభావాన్ని అంచనా వేయడంలో కీలకం. వాతావరణ నమూనాలు ఎప్పటికప్పుడు నవీకరించబడుతున్నందున ఒకసారి ప్రకటించిన తీరం దాటే ప్రాంతాన్ని అంతిమ అంచనాగా భావించలేం. తుపాను తీరానికి దగ్గరవుతున్న కొద్దీ దాని మార్గంపై మరింత స్పష్టత వస్తుంది. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ శాఖ జారీ చేసే తాజా బులెటిన్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

చరిత్రను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు వరుస తుపానుల అనుభవం కొత్తేమీ కాదు. 1976 నవంబర్‌లో రాష్ట్రం కేవలం 23 రోజుల వ్యవధిలో మూడు తుపాన్లను ఎదుర్కొంది. నవంబర్ 4న మచిలీపట్నం సమీపంలో తొలి తీవ్ర తుపాను తీరం దాటింది. ఆ తర్వాత నవంబర్ 16 అర్ధరాత్రి నెల్లూరు-కావలి మధ్య మరో అత్యంత తీవ్ర తుపాను తీరాన్ని తాకింది. ఈ తుపాను కారణంగా కావలి, కావూరు తదితర ప్రాంతాల్లో తీవ్ర నష్టం సంభవించింది. నవంబర్ 26న బాపట్ల సమీపంలో మరో తుపాను తీరం దాటింది. ఈ మూడు వ్యవస్థల ప్రభావంతో కోస్తాంధ్రలో పంటలు, ఇళ్లు, మత్స్యకారుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా 1976 నవంబర్ తుపానుల కారణంగా రాష్ట్రంలోని డెల్టా జిల్లాలు, ప్రకాశం, నెల్లూరు ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి భారీ నష్టం వాటిల్లినట్లు అప్పటి ప్రభుత్వ గణాంకాలు సూచిస్తున్నాయి. 1987లోనూ ఇలాంటి పరిస్థితులే పునరావృతమయ్యాయి. అక్టోబర్ 16న ఒంగోలు సమీపంలో ఒక తుపాను తీరం దాటగా, నవంబర్ 3న నెల్లూరు వద్ద మరో తుపాను ప్రభావం చూపింది. ఆ తర్వాత నవంబర్ 13న మచిలీపట్నం సమీపంలో మూడో తుపాను తీరం దాటింది. కేవలం 29 రోజుల వ్యవధిలో మూడు తుపాను వ్యవస్థలు రాష్ట్రాన్ని ప్రభావితం చేయడం అప్పట్లో పెద్ద విపత్తుగా మారింది. ఈ రెండేళ్లలోనూ ఎల్‌నినో పరిస్థితులు ఉన్నా, ఆ అంశాన్ని మాత్రమే తుపానుల పరంపరకు కారణంగా చూడలేం. ఇక 2013లో బంగాళాఖాతం మరోసారి తుపానుల కేంద్రంగా మారింది. అక్టోబర్‌లో ఫైలిన్ తుపాను ఒడిశా తీరాన్ని తాకగా, నవంబర్ 19 నుంచి 23 మధ్య హెలెన్, నవంబర్ 23 నుంచి 28 మధ్య లెహర్, డిసెంబర్ 6 నుంచి 13 మధ్య మాది తుపానులు ఏర్పడ్డాయి. ఈ వ్యవస్థలన్నీ బంగాళాఖాతంలో వరుసగా అభివృద్ధి చెందడం వాతావరణ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా హెలెన్, లెహర్ తుపానులు ఒకదాని తర్వాత మరొకటి ఏర్పడిన తీరును శాస్త్రీయంగా అధ్యయనం చేశారు. ఇప్పుడు 2026లోనూ అక్టోబర్ చివరి నుంచి నవంబర్ వరకు వరుసగా మూడు తుపాను ముప్పులు ఏర్పడటంతో గత అనుభవాలు మరోసారి గుర్తుకొస్తున్నాయి. ఈసారి అక్వాన్ ఎక్కడ తీరం దాటుతుంది? ఎంత తీవ్రతతో తీరాన్ని తాకుతుంది? ఏయే జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తాయి? అన్నది రానున్న గంటల్లో వెలువడే వాతావరణ అంచనాలపై ఆధారపడి ఉంటుంది. ■




మనసు భారంగా ఉన్నప్పుడు మందుల కంటే ముందు మీ పాదాలను నమ్మండి. ప్రతి అడుగూ గందరగోళంగా ఉన్న ఆలోచనలను ఒక్కొక్కటిగా సర్దుతుంది. పచ్చని చెట్ల నీడలో, చల్లని గాలిలో సాగే నడకలో కొత్త ఊహలు మొలకెత్తుతాయి, సృజనకు రెక్కలొస్తాయి. ఆందోళన కరిగిపోతుంది, ఒత్తిడి దూరమవుతుంది, శరీరం తేలికై ఉత్సాహం నిండుతుంది. గంటల తరబడి అవసరం లేదు, రోజూ కొద్దిసేపు చాలు. ఫోన్‌ను జేబులో పెట్టి, చుట్టూ ఉన్న ప్రకృతిని ఆస్వాదిస్తూ నడవండి. ఉదయమైనా, సాయంత్రమైనా, ఒంటరిగానైనా, నచ్చిన స్నేహితులతోనైనా సరే, ప్రతి నడక మిమ్మల్ని మీకు మరింత దగ్గర చేస్తుంది.

-మహాదేవ


వింతల్లో వింతలు

కిరాణా కొట్టు కోటి



మిచిగాన్‌కు చెందిన 61 ఏళ్ల అలీసా మూర్ సరుకులు కొనడానికి కిరాణా దుకాణానికి వెళ్లారు. బయటికి వస్తూ లాటరీ కియోస్క్ వద్ద ఆగి, అక్టోబర్ 19 పవర్‌బాల్ డ్రా కోసం టికెట్ కొన్నారు. మరుసటి రోజు మిచిగాన్ లాటరీ యాప్‌లో స్కాన్ చేయగా, 1 మిలియన్ డాలర్లు వచ్చినట్టు చూసి కుర్చీలోంచి పడిపోయేంత షాక్ తిన్నారు. ఐదు తెల్ల బంతుల నంబర్లు సరిపోవడంతో ఆ బహుమతి దక్కింది. ఆ సొమ్ముతో ఇంటి రుణాన్ని తీర్చేసి, మిగిలినది దాచుకుంటానని ఆమె చెప్పారు.

జీరో కట్స్‌తో సెన్సార్ పూర్తి చేసుకున్న సల్మాన్ ఖాన్ ‘మాతృభూమి’.. విడుదల ఎప్పుడంటే?



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన ‘మాతృభూమి’ (‘మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్’) చిత్రం సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఖ/ూ 16+ సర్టిఫికెట్ జారీ చేసింది. ఎలాంటి కట్స్ సూచించకుండానే సినిమాకు క్లియరెన్స్ లభించడం విశేషం. ఈ చిత్రం మొత్తం నిడివి 2 గంటల 34 నిమిషాల 12 సెకన్లుగా ఖరారైంది. తొలుత నవంబర్ 20న విడుదల చేయాలనుకున్నప్పటికీ, కొన్ని కారణాలతో వాయిదా పడింది. తాజాగా ఈ చిత్రాన్ని డిసెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. 2020 గల్వాన్ లోయ ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. దేశ రక్షణ కోసం పోరాడే సైనికాధికారి కల్నల్ సంతోష్ బాబు పాత్రలో సల్మాన్ ఖాన్ నటించగా, కుటుంబ బాధ్యతలను నిలబెట్టే భార్య పాత్రలో చిత్రాంగదా సింగ్ కనిపించనున్నారు. వీరిద్దరి త్యాగం, భావోద్వేగాల చుట్టూ కథ సాగుతుంది. మొదట ఈ సినిమాను ‘బ్యాటిల్ ఆఫ్ గల్వాన్’ పేరుతో ప్రకటించగా, మార్చి 2026లో ‘మాతృభూమి’గా మార్చారు. ప్రభుత్వ ఒత్తిడితో స్క్రిప్ట్‌లో మార్పులు చేశారన్న వార్తలను సల్మాన్ ఖాన్ ఖండించారు.

‘దళపతి’ సీన్ రీక్రియేట్ చేసిన అనిల్ రావిపూడి



వినూత్న ప్రమోషన్లతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడంలో దర్శకుడు అనిల్ రావిపూడి ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తన కొత్త సినిమా ‘జనవరి 12 విడుదల’ ప్రమోషన్లను కూడా అదే తరహాలో ప్రారంభించారు. ఈ సినిమాలోని పాటల సందడిని రేపటి నుంచి మొదలుకానుందని వినూత్నంగా ప్రకటించారు.
దళపతి సినిమాలోని ఇందుకోసం సూపర్‌స్టార్ రజనీకాంత్, శోభన నటించిన ‘దళపతి’ సినిమాలోని ఓ ఫేమస్ సన్నివేశాన్ని నటి కృతిశెట్టితో కలిసి రీక్రియేట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది నెట్టింట వైరల్‌గా మారింది. ఇది చూసిన నెటిజన్లు ‘మళ్లీ కొత్త కాన్సెప్టా అనిల్ భయ్యా.. ఈ సారి రజనీసార్‌నే వాడేశారు’గా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా ఇంతకముందు వివాహ భోజనంబు చిత్రంలోని సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందం మధ్య బీచ్‌లో జరిగే ఓ సన్నివేశాన్నిమ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్‌కుమార్‌తో రీక్రియేట్ చేశారు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ మూవీని సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మాస్ యాక్షన్ విందుతో బెల్లంకొండ ‘టైసన్ నాయుడు’ టీజర్.!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో, దర్శకుడు సాగర్ కె. చంద్ర తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘టైసన్ నాయుడు’. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో పవర్‌ఫుల్ లుక్‌తో కనిపించనున్నారు. నేహా శెట్టి, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో నరేష్, రావు రమేష్, సునీల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ‘మదరాసి రబ్బరు బొమ్మ’ పాటకు మంచి స్పందన లభించగా, తాజా టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. త్వరలోనే చిత్ర విడుదల తేదీపై మేకర్స్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

మెన్స్ డే స్పెషల్.. ‘రాపో23’ ప్రీ-లుక్ వైరల్!

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కెరీర్‌లోనే ఒక పెద్ద సాహసానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు హీరోగా అలరించిన ఆయన, ఇప్పుడు తొలిసారిగా కథ రాసి, దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న ‘రాపో23’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా, నియో-నోయిర్ శైలిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఆరంభం నుంచే మంచి ఆసక్తి నెలకొంది.
నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం (ఇంటర్నేషనల్ మెన్స్ డే) సందర్భంగా రామ్ పోతినేని ఈ సినిమా నుంచి ఒక ఆసక్తికరమైన ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. “ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్” అనే క్యాప్షన్‌తో వచ్చిన ఈ పోస్టర్‌లో రామ్ తనదైన శైలిలో, కొత్త లుక్‌తో కనిపిస్తూ అభిమానుల్లో జోష్ నింపారు. తన దారిని తానే ఎంచుకుంటూ, ప్రపంచాన్ని ఒంటరిగా ఎదుర్కొనే స్వతంత్ర వ్యక్తిగా ఈ పాత్రను ఆయన పరిచయం చేశారు. ఈ పోస్టర్ ద్వారా అందరికీ మెన్స్ డే విషెస్ చెప్పిన చిత్రబృందం, త్వరలోనే సినిమా ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ సినిమా టైటిల్ ఏంటి, టీజర్ ఎలా ఉండబోతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తుండగా, ఎస్. తిరునావుక్కరసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూస్తున్నారు. దర్శకుడిగా, నటుడిగా రామ్ పోతినేని ఈ సినిమాతో ఎలాంటి కొత్త అనుభూతిని పంచుతారో చూడాలి.

20 రోజులకే ఓటీటీలోకి వచ్చేసిన విశ్వక్ సేన్ ‘కల్ట్’ స్ట్రీమింగ్ ఎందులో అంటే?



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో నటించిన సైకలాజికల్ స్లాషర్ థ్రిల్లర్ ‘కల్ట్’ అనూహ్యంగా ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన కేవలం 20 రోజులకే ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రావడం విశేషం. ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులో ఉంది. 2026 అక్టోబర్ 30న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, మిశ్రమ స్పందనల మధ్య థియేటర్ రన్ పూర్తి చేసుకున్న వెంటనే ఓటీటీలోకి అడుగుపెట్టింది. కథ విషయానికి వస్తే, ఒక భారీ పార్టీ వేదికగా మొదలైన సంబరం, వరుస హత్యలు మరియు ఉత్కంఠభరిత పరిణామాలతో ప్రమాదకరంగా మారుతుంది. ఆ పరిస్థితుల్లో డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు, అసలు మిస్టరీ ఏంటి అనే ఆసక్తికర అంశాలతో ఈ స్లాషర్ థ్రిల్లర్ సాగుతుంది. విశ్వక్ సేన్ సరసన గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్‌గా నటించగా, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, ప్రజ్ఞ కీలక పాత్రల్లో కనిపించారు. తరుణ్ భాస్కర్ సంభాషణలు అందించగా, రవి బస్రూర్ సంగీతం సమకూర్చారు. తారక్ సినిమాస్ ఎల్ఎల్పీ, వన్మయే క్రియేషన్స్ బ్యానర్లపై సందీప్ కాకరాల, కరాటే రాజు ఈ చిత్రాన్ని నిర్మించారు. థియేటర్లలో మిస్సయిన వారు లేదా కొత్త స్లాషర్ థ్రిల్లర్ జోనర్‌ను ఇష్టపడే ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com